




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 91, పేజీలు - 08

శుక్రవారం, సెప్టెంబర్ 5, 2025 వెల: 5 రూ/.









## ఆఫ్ఘనిస్థాన్ లో భూకంప విలయం

**- 2,217కి చేరిన మృతుల సంఖ్య**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. దేశ తూర్పు ప్రాంతాన్ని కుదిపేసిన ఈ ప్రకృతి విపత్తులో మరణించిన వారి సంఖ్య 2,200 దాటింది. మరో 4,000 మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కునార్ ప్రావిన్స్‌లో భూకంప తీవ్రత అత్యధికంగా ఉంది. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొండ ప్రాంతాలు కావడంతో సహాయక

2లో..

## జీఎస్టీపై మోదీ సర్కార్ 'కుంభకర్ణ నిద్ర' వీడింది

**- మల్లికార్జున ఖర్గే వ్యంగ్యాస్త్రాలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ఎనిమిదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జ్ఞానోదయం కలిగిందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లకు కేంద్ర ప్రభుత్వం 'కుంభకర్ణ నిద్ర' వీడి మేల్కొనడం మంచి విషయమేనంటూ ఆయన గురువారం

2లో..

## మైహోమ్ భుజాలో రూ. 51 లక్షలు పలికిన గణేశుడి లడ్డూ

**- రూ. 51,77,777కు దక్కించుకున్న ఇల్లందుకు చెందిన గణేశ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వినాయక చవితి వేడుకల్లో గణపతి విగ్రహాలతో పాటు లడ్డూ వేలంపాటలు కూడా భక్తుల దృష్టిని ఆకర్షించే ముఖ్యాంశం. తెలుగు రాష్ట్రాల్లో ఖైరతాబాద్ గణపతి విగ్రహం , బాలాపూర్ గణేశ్ లడ్డూ ప్రత్యేక గుర్తింపు పొందాయి. అయితే గత కొన్నేళ్లుగా బాలాపూర్ మాత్రమే కాకుండా నగరంలోని ఇతర

2లో..

## దారికి తెచ్చుకోవడమేనా.?

**- జగన్, కేసీఆర్ లకు బీజేపీ నుంచి ముప్పు.?**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల జోలికి పెద్దగా వెళ్లదు. తమ పార్టీలో విలీనం చేసుకునేందుకు ప్రయత్నించదు. అవసరమైన సమయంలో ప్రాంతీయ పార్టీలకు చెందిన రాజ్యసభ సభ్యులను తమ పార్టీకి చేర్చుకుంటుంది కానీ, దేశంలో ప్రాంతీయ పార్టీలను తనలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. ఎందుకంటే బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆ రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఓట్లు కలిగి ఉంటాయి. జాతీయ పార్టీలకు మించి ప్రాంతీయ పార్టీలకు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉంటుంది. అందుకే వాటిని భయపెట్టో, బతిమాలో తమకు మద్దతును తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది తప్ప విలీనం అన్న ప్రశ్నే ఉత్పన్నం కాదన్నది ఇప్పటి వరకూ జరిగిన రాజకీయ పరిణామాలు చూసిన వారికి ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.

**ఇప్పటి వరకూ ఏ పార్టీనీ..**

మహారాష్ట్రలో కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో భయపెట్టి శివసేనను చీల్చింది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీ జోలికి పోలేదు. ఇక ఢిల్లీలో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పై కేసులు బనాయించి జైల్లోకి తోసి ఢిల్లీలో అధికారంలోకి రాగలిగింది. అదే సమయంలో తమిళనాడులో డీఎంకే జోలికి కూడా పోలేదు. అక్కడ అన్నా డీఎంకేతో పొత్తు పెట్టుకుంది. ఇప్పుడు విజయ్ పార్టీతో పొత్తుకు ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోనూ తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీలతో కూటమితో ఉన్నప్పటికీ అక్కడ కూటమికి ప్రత్యర్థిగా ఉన్న జగన్ జోలికి బీజేపీ వెళ్లడం లేదు. జగన్ మద్దతు ఎప్పటికైనా తమకు అవసరమని భావించడంతోనే పదకొండు నెలల నుంచి జగన్ పై ఉన్న కేసులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

**ఇద్దరితోనూ సఖ్యతగానే..**

తాజాగా తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని కూడా అదే రకంగా దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తుంది. అవసరమైతే పొత్తు పెట్టుకోవడం

2లో..

## బెంగాల్ అసెంబ్లీలో కొట్టుకున్న బీజేపీ, తృణమూల్ ఎమ్మెల్యేలు

**- మమతా బెనర్జీ కామెంట్సే కారణం**



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో గురువారం జరిగిన సమావేశం రణరంగాన్ని తలపించింది. బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న దాడులను ఖండిస్తూ తీర్మానంపై చర్చ సందర్భంగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలో, ప్రతిపక్ష బీజేపీ ఎమ్మెల్యేలు ఆమె ప్రసంగాన్ని అడ్డుకునేందుకు కేకలు, నినాదాలతో సభలో గందరగోళం సృష్టించారు. స్పీకర్ బిమన్ బెనర్జీ ఆదేశాల మేరకు మార్షల్స్ బీజేపీ ఎమ్మెల్యేలను బలవంతంగా సభ నుండి బయటకు తీసుకెళ్లారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ చర్చ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతుండగా,

2లో..

## ఏపీలో ప్రజలందరికీ ఆరోగ్య బీమా

- యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ ఆమోదం
- ప్రతి కుటుంబానికి ఏటా రూ. 25 లక్షల ఆరోగ్య బీమా
- రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి
- ఆరు గంటల్లోనే వైద్య చికిత్సకు అనుమతులు



అమరావతి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ఆయుష్మాన్ భారత్-ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద యూనివర్సల్ హెల్త్ పాలసీకి ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని ప్రతీ పౌరుడుకి ఆరోగ్య బీమా కల్పించనున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య బీమా అందించనున్నారు. ఇక ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలోని ఒక్కో కుటుంబానికి ప్రతీ సంవత్సరానికి రూ.25 లక్షల వరకు ఫ్రీగా మెడికల్ ట్రీట్‌మెంట్ అందించనున్నారు. ఇక పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడాలు లేకుండా అన్ని కుటుంబాలకూ ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీని అమలు చేయాలని ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే ఏపీలోని 1.63 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమాను కల్పించేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణను తయారు చేసింది. ఈ నేపథ్యంలోనే 2,493 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా మెడికల్ ట్రీట్‌మెంట్ అందించేలా ఎన్టీఆర్ వైద్య సేవ

2లో..

## నిధులు విడుదలకు గ్రీన్ సిగ్నల్

**త్వరలో రాష్టానికి కేంద్ర బృందాలు**

2లో..



## డ్రగ్స్ మాఫియాపై ఏపీ సర్కార్ యుద్ధం

**- కీలక ఆదేశాలు జారీ**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. స్మగ్లర్ల నెట్ వర్క్ పై ఉక్కుపాదం మోపడంతో పాటు, వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను అరికట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు ఉపక్రమించింది. ఉండవల్లిలో గురువారం హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ భేటీలో మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఈగల్ బృందం సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా

2లో..

## రోడ్లు బాగాలేవు.. మీరెంత ఫైన్ కడతారు

**- కలెక్టర్‌ను నిలదీసిన సామాన్యుడు**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) సాధారణంగా లైసెన్స్ లేదనో, హెల్మెట్ లేదనో, ఇన్సూరెన్స్ లేదనో, వాహనానికి సరైన పత్రాలు లేకపోతేనో ట్రాఫిక్ పోలీసులు ఫైన్ కట్టించుకుంటారు. కానీ విచిత్రంగా ఓ సామాన్యుడు ప్రభుత్వాన్నే ఫైన్ కట్టాలని నిరసన వ్యక్తం చేశాడు. నా దగ్గర అన్ని పేపర్లు కరెక్ట్‌గానే ఉన్నాయి. మీరు వేసిన రోడ్లే సరిగా లేవంటూ ఏకంగా రోడ్డుపై కూర్చోని ధర్నా చేశాడు. ఈ ఘటన కరీంనగర్-జగిత్యాల రహదారిపై చోటు చేసుకుంది. ట్రాఫిక్ నిబంధనల పేరుతో పోలీసులు విధించే జరిమానాల పట్ల ప్రజల్లో కొంత అసహనం ఉన్న మాట వాస్తవం. వాహనదారుల దగ్గర లైసెన్స్,

2లో..

## బాధితులను ఆదుకుంటాం.. పంట నష్టపరిహారం చెల్లిస్తాం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- వరద నష్టంపై కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సమీక్ష
- మరమ్మతులు, నిర్మాణాలు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలన్న సీఎం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. దీని కారణంగా పలు జిల్లాలు వరదలకు గురయ్యాయి. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. గ్రామాలు నీట మునిగాయి. వందలాది కుటుంబాలు ఇళ్ళు కోల్పోయాయి. పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డికి వెళ్లారు. తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చేరుకున్న ఆయన వరద బాధితులను

2లో..

## కేసీఆర్ బాటలో నడుస్తూ సామాజిక తెలంగాణ సాధిస్తారా.?

**- సంచలన రాజీనామా వెనుక అసలు కథేంటి.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో గత పాతికేళ్లలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొన్ని రాజకీయ పరిణామాలు సరికొత్త శకానికి తెరలేపగా, మరికొన్ని టీ కప్పులో తుపాను మాదిరి సమసిపోయాయి. పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. అదే మాదిరిగా ఇప్పుడు ఆయన

2లో..

## గణేశ్ మహా నిమజ్జనం ట్రాఫిక్ ఆంక్షలు

**- ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్ వైపు వెళ్లే ప్రధాన మార్గాలు మూసివేత**

2లో..



## మా బంధం దౌత్యానికి మించినది

**- సింగపూర్‌పై మోదీ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, సింగపూర్ మధ్య సంబంధాలు కేవలం దౌత్యపరమైన అంశాలకే పరిమితం కాదని, ఇరు దేశాల భాగస్వామ్యం సాంప్రదాయ రంగాలను దాటి అత్యాధునిక సాంకేతిక రంగాల వైపు శరవేగంగా విస్తరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి గురువారం న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు పరస్పర ప్రయోజనాలే లక్ష్యంగా, శాంతి, శ్రేయస్సు అనే ఉమ్మడి

3లో..

# ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంప విలయం

బృందాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాలిబాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఈ భూకంపంలో ఇప్పటివరకు 2,217 మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 4,000 మంది గాయపడ్డారని డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హందుల్లా ఫిత్రత్ 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైంది.

### మట్టి దిబ్బలుగా మారిన గ్రామాలు

భూకంప ధాటికి అనేక గ్రామాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు పేకమేడల్లా కూలిపోవడంతో వందలాది కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. హెలికాప్టర్లు దిగలేని మారుమూల పర్వత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తాలిబాన్ అధికారులు కమాండోలను గాల్లోంచి దించుతున్నారు. ఇదిలా ఉండగా, గురువారం మరోసారి 4.8 తీవ్రతతో భూమి కంపించడం ప్రజలను మరింత భయాందోళనకు గురిచేసింది. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, మంగళవారం కూడా 5.2 తీవ్రతతో భూకంపం సంభవించింది.

### భారత్ మానవతా సాయం

ఈ విపత్తుపై స్పందించిన భారత్, ఆఫ్ఘనిస్థాన్‌కు అండగా నిలిచింది. 21 టన్నుల సహాయ సామగ్రితో కూడిన విమానాన్ని కాబూల్‌కు పంపింది. ఇందులో టెంట్లు, దుప్పట్లు, అత్యవసర మందులు, జనరేటర్లు, నీటి ట్యాంకులు ఉన్నాయి. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, అవసరమైన మరింత సహాయం అందిస్తామని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. యూరేషియన్, ఇండియన్ టెక్టోనిక్ ప్లేట్ల సమీపంలో ఉండటం, బలహీనమైన నిర్మాణాల కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో తరచూ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి.

# జీఎస్టీపై మోదీ సర్కార్ 'కుంభకర్ణ నిద్ర' వీడింది

వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జీఎస్టీ కౌన్సిల్ ఇటీవల పన్ను స్లాబులలో కీలక మార్పులు చేసిన నేపథ్యంలో ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. గత దశాబ్ద కాలంగా జీఎస్టీని సరళీకరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తూనే ఉందని ఖర్గే గుర్తుచేశారు. "మోదీ ప్రభుత్వం 'ఒకే దేశం, ఒకే పన్ను' అనే నినాదాన్ని 'ఒకే దేశం, 9 పన్నులు'గా మార్చేసింది. 0%, 5%, 12%, 18%, 28% స్లాబులతో పాటు 0.25%, 1.5%, 3%, 6% ప్రత్యేక రేట్లను ప్రవేశపెట్టి గందరగోళం సృష్టించింది" అని ఆయన విమర్శించారు. సరళమైన పన్నుల విధానంతో 'జీఎస్టీ 2.0'ను తాము 2019, 2024 మేనిఫెస్టోలలోనే ప్రతిపాదించామని తెలిపారు. ఒకప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీనే జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకించారని ఖర్గే ఆరోపించారు. "2011లో అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ జీఎస్టీ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ అడ్డుపడింది. కానీ ఇవాళ అదే బీజేపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు జరిగాయని సంబరాలు చేసుకుంటోంది. సామాన్యుల నుంచి పన్నులు వసూలు చేయడం గొప్ప ఘనత అన్నట్లుగా వ్యవహరిస్తోంది" అని ఆయన దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం పాలు, పెరుగు, పిండి, ధాన్యాలతో పాటు వ్యవసాయ రంగానికి చెందిన 36 వస్తువులపై జీఎస్టీ విధించిందని, అందుకే తాము దీనిని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అని పిలుస్తున్నామని ఖర్గే అన్నారు. వసూలవుతున్న మొత్తం జీఎస్టీలో 64 శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుంచే వస్తోందని, కానీ కేవలం 3 శాతం మాత్రమే కుబేరుల నుంచి వస్తోందని ఆయన ఆరోపించారు. తాజాగా చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రాలు ఆదాయం కోల్పోయే అవకాశం ఉన్నందున, 2024-25ను ఆధార సంవత్సరంగా తీసుకుని ఐదేళ్లపాటు పూర్తి పరిహారం చెల్లించాలని ఖర్గే డిమాండ్ చేశారు. అలాగే, సంక్లిష్టమైన జీఎస్టీ నిబంధనలను తొలగిస్తేనే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) నిజమైన ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మైహోమ్ భుజాలో
# రూ. 51 లక్షలు పలికిన గణేశుడి లడ్డూ

ప్రాంతాల్లోనూ లడ్డూ వేలం పాటలు విశేష చర్చకు దారితీస్తున్నాయి. వాటిలో రాయదుర్గం లడ్డూ వేలంపాట ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. రాయదుర్గంలోని మైహోమ్ భుజా వద్ద ఈ సంవత్సరం జరిగిన గణేశ్ లడ్డూ వేలం రికార్డులు బద్దలు కొట్టింది. ఇల్లందుకు చెందిన కొండపల్లి గణేశ్ అనే భక్తుడు ఏకంగా రూ. 51,77,777 చెల్లించి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ ధర ఇప్పటి వరకు రాయదుర్గంలోనే కాకుండా నగరవ్యాప్తంగా లడ్డూ వేలంపాటల్లో చరిత్ర సృష్టించింది. గత ఏడాది ఇదే లడ్డూ రూ. 29 లక్షలకు అదే గణేశ్ కొనుగోలు చేయడం విశేషం. అంతకుముందు 2023లో ఈ లడ్డూ రూ. 25.50 లక్షలకు చిరంజీవి గౌడ్ సొంతం చేసుకున్నారు. 2022లో రూ. 20.50 లక్షలకు వ్యాపారవేత్త సత్తిబాబు గెలుచుకున్నారు. బాలాపూర్ లడ్డూ అనగానే దశాబ్దాలుగా రికార్డు ధరలు పలికిన సంప్రదాయం గుర్తుకు వస్తుంది. గత ఏడాది బాలాపూర్ లడ్డూ రూ. 25 లక్షలకు వెళ్లింది. కానీ ఈసారి రాయదుర్గం లడ్డూ ఆ మొత్తాన్ని మించి, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. భక్తులు లడ్డూను సొంతం చేసుకోవడానికి కోట్లలోనైనా వెనుకాడకపోవడానికి కారణం అది ఇంటికి శుభం, సంపద, ఆరోగ్యం తీసుకువస్తుందని నమ్మకం. అంతేకాక ఈ లడ్డూ గెలుచుకున్నవారికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందనేది మరొక కారణం. ఈ లడ్డూ వేలంపాటల ద్వారా వచ్చిన నిధులు వినాయక ఉత్సవాల నిర్వహణతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం ఒక మంచి సంప్రదాయంగా కొనసాగుతోంది. విద్య, వైద్యం, అవసరమైన సామాజిక పనులకు ఈ నిధులను వినియోగించడం వలన భక్తి కార్యక్రమాలకే కాదు సమాజానికి కూడా ప్రయోజనం కలుగుతోంది. ఇక భవిష్యత్తులో బాలాపూర్, రాయదుర్గం మాత్రమే కాకుండా మరిన్ని ప్రాంతాల్లో లడ్డూ వేలం పాటలు రికార్డు స్థాయిలో జరుగుతాయని అంచనా. గతంలో హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ కీర్తి రిచ్‌మంచ్ విల్లాస్ వద్ద నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో గణపతి లడ్డూ ఏకంగా రూ. 1.86 కోట్లు పలికింది. ఈ ధరతో గణేశుడి లడ్డూ వేలం పాటల్లో కొత్త బెంచ్‌మార్క్ ఏర్పడి, ఇప్పటి వరకు ఎవరూ అందుకోలేని గరిష్ట స్థాయిని చేరుకుంది. ఈ రికార్డు మొత్తం తెలుగు రాష్ట్రాల గణేశ్ ఉత్సవాల చరిత్రలోనే కాదు, దేశవ్యాప్తంగా లడ్డూ వేలం పాటల్లోనూ అత్యంత ప్రాధాన్యత సాధించింది.

# బెంగాల్ అసెంబ్లీలో కొట్టుకున్న బీజేపీ, తృణమూల్ ఎమ్మెల్యేలు

బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి సస్పెన్షన్‌ను ప్రశ్నిస్తూ నినాదాలు చేశారు. ఈ గందరగోళంలో బీజేపీ చీఫ్ విప్ శంకర్ ఘోష్‌ను స్పీకర్ బిమన్ బెనర్జీ ఆ రోజు మిగిలిన సమావేశం నుండి సస్పెండ్ చేశారు. ఘోష్ సభ నుండి వెళ్లడానికి నిరాకరించడంతో, మార్షల్స్ అతన్ని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో శంకర్ ఘోష్ గాయపడ్డారని బీజేపీ ఆరోపించింది. తర్వాత నినాదాలు చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అగ్నిమిత్రా పాల్‌ను కూడా సస్పెండ్ చేశారు. మహిళా మార్షల్స్ ద్వారా బయటకు తీసుకెళ్లారు. తర్వాత ఎమ్మెల్యేలు మిహిర్ గోస్వామి, అశోక్ దిండా, బంకిమ్ ఘోష్‌లను కూడా సస్పెండ్ చేశారు. ఈ సంఘటనలతో అసెంబ్లీ దాదాపు 15 నిమిషాల పాటు గందరగోళంగా మారింది. బీజేపీ ఎమ్మెల్యేలు సభలో నీటి సీసాలు విసిరారని, టీఎంసీ ఎమ్మెల్యేలు కూడా ప్రతిగా నినాదాలు చేశారని పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. మమతా బెనర్జీ తన ప్రసంగంలో బీజేపీని బెంగాల్ వ్యతిరేక, అవినీతిపరులు, ఓటు చోరీలో నిమగ్నమైన పార్టీగా విమర్శించారు. "బీజేపీ బెంగాలీ భాష, పేదలు, ఎస్సీలు, హిందువులకు వ్యతిరేకం. వారు అతి పెద్ద దొంగల ముఠాలు , ఓటు చోరీలో నిమగ్నమైన పార్టీ," అని ఆమె ఆరోపించారు. బీజేపీ బెంగాలీలపై వివక్ష చూపిస్తోందని దీనివల్ల బెంగాల్‌లో ఒక్క బీజేపీ ఎమ్మెల్యే కూడా గెలవకుండా ప్రజలే నిర్ణయిస్తారని ఆమె అన్నారు. "బీజేపీ ఢిల్లీ నుండి రిమోట్ కంట్రోల్‌తో బెంగాల్‌ను తమ కాలనీగా మార్చాలని కోరుకుంటోంది. వారు పార్లమెంట్‌లో మా ఎంపీలను సీఐఎస్ఎఫ్‌తో వేధించారు, ఇప్పుడు బెంగాల్‌లో కూడా మా గొంతును అణచివేయాలని చూస్తున్నారు," అని విమర్శించారు. సభలో జరిగిన సంఘటనలను "బెంగాల్‌లో ప్రజాస్వామ్య హత్య"గా బీజేపీ అభివర్ణించింది. బీజేపీ చీఫ్ విప్ శంకర్ ఘోష్‌పై మార్షల్స్ దాడి చేశారని ఆరోపిస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, బెంగాలీ గుర్తింపు, ఓటరు జాబితాల తారుమారు, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడులు వంటి అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారాయి.

# దారికి తెచ్చుకోవడమేనా.?

లేకుంటే తమకు అవసరమైన సమయంలో మద్దతు ఇచ్చేలా వ్యవహరిస్తుందే తప్ప తన పార్టీలో విలీనం చేసుకునే ప్రయత్నం చేయదు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరిగా పోటీ చేయాలని బీజేపీ గట్టిగా భావిస్తుంది. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోమని ఇప్పటికే నేతలు స్పష్టం చేశారు. అవసరమైతే రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి రావడానికి అవసరమైన మద్దతు పొందేందుకు మాత్రమే ప్రయత్నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జగన్ ను కానీ, తెలంగాణలో కేసీఆర్ ను కాని బీజేపీ తమకు వ్యతిరేకంగా మలచుకోదు. జగన్, కేసీఆర్ లు కాంగ్రెస్ కు శత్రువులు కావడంతో తమకు మిత్రులుగానే చూడాలనుకుంటుంది. అదే బీజేపీ స్ట్రాటజీ. రానున్న కాలంలోనూ ఏపీ, తెలంగాణలలో అలాగే ఆ పార్టీ రాజకీయంగా అడుగులు వేయనుంది. అందుకే జగన్, కేసీఆర్ లకు వచ్చే ముప్పు లేదన్నది వాస్తవం.

# డ్రగ్స్ మాఫియాపై ఏపీ సర్కార్ యుద్ధం

వివరించారు. గంజాయి సాగును అరికట్టేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఉపసంఘం సూచించింది. ముఖ్యంగా కొండ ప్రాంతాల్లో సాగవుతున్న గంజాయిని గుర్తించేందుకు డ్రోన్లు, శాటిలైట్ చిత్రాలను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఈ చిత్రాలను విశ్లేషించి, సాగు జరుగుతున్న ప్రాంతాలను కచ్చితంగా గుర్తించాలని ఆదేశించింది. అలాగే, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుని సరిహద్దుల్లో రవాణాను పూర్తిగా నిరోధించాలని పేర్కొంది. మాదకద్రవ్యాల నియంత్రణలో సమాచార విశ్లేషణ అత్యంత కీలకమని ఉపసంఘం అభిప్రాయపడింది. క్షేత్రస్థాయి సమాచారం, కేసుల పురోగతి, నిఘా వర్గాల నివేదికలు, డ్రోన్ చిత్రాల విశ్లేషణ వంటి అన్ని అంశాలను ఒకేచోట పర్యవేక్షించేందుకు ఆర్టీజీఎస్ ద్వారా ఒక ప్రత్యేక డ్యాష్ బోర్డును రూపొందించాలని ఆదేశించింది. హాట్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో ప్రజల నుంచి సమాచారం సేకరించి, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడేందుకు విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఉపసంఘం ఆదేశించింది. ప్రతి నెలా ఒక శనివారం 'ఈగల్ క్లబ్స్' ద్వారా గంజాయి దుష్పరిణామాలపై విద్యార్థులకు వివరించాలని తెలిపింది. మరోవైపు, అమాయక గిరిజనులను గంజాయి సాగుకు పావులుగా వాడుకుంటున్నారని, ఐటీడీఏల ద్వారా వారికి అవగాహన కల్పించాలని సూచించింది. డ్రగ్స్ కు బానిసలైన వారిని బయటకు తీసుకువచ్చేందుకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డి-అడిక్షన్ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, దీనికోసం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలని, చార్జిషీట్లను సకాలంలో దాఖలు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులకు దిశానిర్దేశం చేసింది.

# బాధితులను ఆదుకుంటాం..

కలుసుకుని పరామర్శించారు. వరదల సమయంలో బలహీనంగా మారిన లింగంపల్లికుర్దు ఆర్ అండ్ బి బ్రిడ్జిని సీఎం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కూడా ఆయన సందర్శించారు. ఇది కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకూడదని శాశ్వత పరిష్కారం కోసం పటిష్ట ప్రణాళికలు రూపొందించాలనే ఆదేశాలు అధికారులకు ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా ఉండేందుకు బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్ లేదా బ్రిడ్జ్ కమ్ చెక్‌డ్యామ్ మాదిరి నిర్మాణాలు చేయగలమా అనే అంశంపై సవివరంగా అధ్యయనం చేయాలని సూచించారు. శాశ్వత ప్రణాళికలతోనే గ్రామీణ ప్రజలు భద్రతగా జీవించగలరని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో మాట్లాడిన ఆయనకు వారు తమ ఇబ్బందులను ఆవేదనతో వివరించారు. పొలాల్లో ఇసుక మట్టిపాలైపోయినట్లు, వరదల వల్ల పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని, గృహాలు కూడా మునిగిపోయి జీవనోపాధి దెబ్బతిన్నదని తెలిపారు. బాధాకర పరిస్థితిని విన్న సీఎం ప్రజలను ఓదార్చారు. 'ప్రభుత్వం మీ వెంటే ఉంది. ఎవరినీ వదిలిపెట్టం. పంట నష్టానికి సరైన పరిహారం అందుతుంది. ఇళ్ళు కోల్పోయిన వారికి నివాసం కల్పిస్తాం. పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తాం' అని భరోసా ఇచ్చారు. వరదల ప్రభావం ఇరిగేషన్ ప్రాజెక్టులపైనా పడింది. ముఖ్యంగా మైనర్, మేజర్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. అయితే పోచారం ప్రాజెక్టు భీకర వరదను తట్టుకుని నిలబడటంతో పెద్ద నష్టం తప్పిందని సీఎం పేర్కొన్నారు. తక్షణం మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని సీఎం అధికారులను ఆదేశించారు. "ఇది వందేళ్లలో చూడని వరద. కష్టం వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలిచే వాడే నిజమైన నాయకుడు. ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారు. ఇకపై ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. అన్ని రకాల రోడ్లు, ప్రాజెక్టులు మరమ్మతు అవుతాయి. వ్యవసాయదారుల కష్టానికి తగిన పంటనష్టం పరిహారం ఇస్తాం. బాధిత కుటుంబాలు కోలుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక సమర్పించాలి. బాధలు తీరే వరకు మా సహాయం ఆగదు" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్శనతో బాధితులు కొంత ధైర్యం పొందారు. ఇప్పటి వరకు తమను ప్రభుత్వం పట్టించుకోలేదని ఎవరూ పరామర్శకు కూడా రాలేదని బాధపడిన వారికి సీఎం భరోసాతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# నిధులు విడుదలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన విధ్వంసాన్ని వివరిస్తూ కేంద్రం సహకారం కోరారు. ఆగస్టు 25 నుంచి 28 వరకు పడిన వర్షాలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు.

### నష్టాల వివరాలు..

మంత్రులు అందజేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, నిర్మల్ వంటి జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పంటలు, పశువులు, ఇళ్లు, రహదారులు, విద్యుత్ సదుపాయాలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 22 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదికలో పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటివరకు దాదాపు రూ.5,018 కోట్ల విలువైన నష్టం సంభవించిందని నివేదికలో స్పష్టం చేశారు. రహదారులు, విద్యుత్ సరఫరా వ్యవస్థ, నీటిపారుదల వనరులు, గ్రామీణాభివృద్ధి, వైద్య సదుపాయాలు, పశుసంవర్ధక, మున్సిపల్ పరిపాలన, గృహనిర్మాణం, మహిళా%-%శిశు సంక్షేమం వంటి విభాగాలపై విస్తృతంగా ప్రభావం చూపిందని వివరించారు. అత్యవసర మరమ్మతులు, పునరుద్ధరణ పనుల కోసం మాత్రమే దాదాపు రూ.1,500 కోట్లు అవసరమని మంత్రులు పేర్కొన్నారు.

### రాష్ట్ర ప్రభుత్వ చర్యలు..

ప్రస్తుతం 7 ఎన్డీఆర్ఎఫ్, 15 ఎస్టీఆర్ఎఫ్ బృందాలు, సైనిక దళాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. పాడైన మౌలిక సదుపాయాలను తాత్కాలికంగా పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయి. ప్రాణనష్టాన్ని తగ్గించడానికి అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

### కేంద్ర సహాయం కోసం విజ్ఞప్తి..

గత సంవత్సరం వరదల కారణంగా రూ.11,713 కోట్లు నష్టం సంభవించినప్పటికీ.. కేవలం రూ.416.80 కోట్లు మాత్రమే మంజూరు అయ్యాయని మంత్రులు గుర్తు చేశారు. ఈసారి అంచనా వేసిన రూ.5,018 కోట్లతో కలిపి, మొత్తం రూ.16,732 కోట్ల సహాయం విడుదల చేయాలని కేంద్రానికి పత్రం అందజేశారు.

### అమిత్ షా స్పందన..

ఈ సమావేశంలో అమిత్ షా సానుకూలంగా స్పందించి, త్వరలో కేంద్ర బృందాలను తెలంగాణకు పంపించి నష్టాలను స్వయంగా అంచనా వేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అభ్యర్థనపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# ఏపీలో ప్రజలందరికీ ఆరోగ్య బీమా

హైబ్రిడ్ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,257 రకాల ట్రీట్‌మెంట్‌లను హైబ్రిడ్ పద్ధతిలో ఉచితంగా ప్రజలకు అందించనున్నారు. మరోవైపు ట్రీట్‌మెంట్ కోసం వచ్చేవారికి వీలైనంత త్వరగా అప్రూవల్ ఇచ్చేందుకు కూడా చర్యలు చేపడుతున్నారు. అప్లై చేసుకున్న 6 గంటల్లోనే ట్రీట్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చేలా ప్రీ ఆథరైజేషన్ మేనేజ్‌మెంట్ కోసం చర్యలు చేపట్టారు. రూ.2.5 లక్షలలోపు ఉన్న ట్రీట్‌మెంట్‌లకు సంబంధించిన క్లెయిమ్‌లు ఇన్సూరెన్స్ కంపెనీల పరిధిలోకి వచ్చేలా సరికొత్త విధానాన్ని తీసుకువచ్చారు. ఇక రూ.2.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు అయ్యే వైద్య ఖర్చులను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ చెల్లించనుంది. ఇక ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.43 కోట్ల పేద కుటుంబాలతో పాటు 20 లక్షల మంది మధ్య తరగతి, ఉన్నత వర్గాలకు చెందిన కుటుంబాలకు ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీని వర్తింపజేసేలా కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. ఇక రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి కూడా ఏపీ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం) విధానంలో ఆంధ్రప్రదేశ్‌లో 10 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేసేందుకు ఆమోదం కల్పించింది. ఈ 10 కాలేజీలను ఒకే దశలో కాకుండా రెండు దశల్లో నిర్మించనున్నారు. మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లె, పెనుగొండ, పాలకొల్లు, బాపట్ల, అమలాపురం, నర్సీపట్నం, పార్వతీపురంలో కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయనున్నారు.

# గణేశ్ మహా నిమజ్జనం ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నవరాత్రుల పాటు అంగరంగ వైభవంగా పూజలందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరే సమయం ఆసన్నమైంది. వినాయక చవితి ఉత్సవాల ముగింపు ఘట్టమైన గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా హైదరాబాద్ మహానగరంలో పోలీసులు సెప్టెంబరు 6, 7 తేదీల్లో భారీ ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించారు. దాదాపు 28 గంటల పాటు నగరంలోని కీలక మార్గాలలో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సాఫీగా సాగేందుకు, అదే సమయంలో సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ యంత్రాంగం వెల్లడించింది. ఈ సమయంలో నగరవాసులు పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ప్రధాన శోభాయాత్ర మార్గాలు ఇవే

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నగరం నలుమూలల నుంచి విగ్రహాలు హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలిరానున్నాయి. ఇందులో అత్యంత ప్రధానమైన బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ్ వైపు సాగుతుంది. అదేవిధంగా, సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం, లక్డీకాపూల్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రధాన మార్గాలన్నింటిలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు.

### ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయాలు

నగరంలోని వివిధ జోన్లలో ట్రాఫిక్‌ను భారీగా మళ్లించనున్నారు. ముఖ్యంగా సౌత్ ఈస్ట్ జోన్‌లో కేశవగిరి, చాంద్రాయణగుట్ట, మూసారాంబాగ్, చంచల్‌గూడ ప్రాంతాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఇతర మార్గాల వైపు పంపిస్తారు. అలియాబాద్, మదీనా, నయాపూల్, ఎంజే మార్కెట్, శివాజీ బ్రిడ్జ్, పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, వైఎంసిఏ వంటి రద్దీ ప్రాంతాలలో కఠినమైన ఆంక్షలు ఉంటాయి. అదేవిధంగా, లిబర్టీ, అబిడ్స్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, బుద్ధభవన్ జంక్షన్లను పూర్తిగా మూసివేస్తారు. నార్త్ జోన్‌లో పాట్నీ, పారడైజ్, రాణిగంజ్ చౌరస్తాలలో ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మార్గాన్ని మాత్రమే ఉపయోగించాలని పోలీసులు సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాలనుకునే వారు బేగంపేట, పారడైజ్ మార్గాన్ని ఎంచుకోవడం సురక్షితం. అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు మళ్లిస్తారు. ఆర్టీసీ బస్సులు సైతం రద్దీ సమయాల్లో మెహిదీపట్నం, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, నారాయణగూడ వరకు మాత్రమే వచ్చి వెళ్లనున్నాయి.

### భారీ వాహనాలపై నిషేధం, పార్కింగ్ సౌకర్యాలు

నిమజ్జనం సందర్భంగా నగరాన్ని ట్రాఫిక్ రద్దీ నుంచి కాపాడేందుకు భారీ వాహనాలపై నిషేధం విధించారు. సెప్టెంబర్ 6వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి 11 గంటల వరకు నగరంలోకి లారీల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ వాహనాలు కేవలం ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మాత్రమే ప్రయాణించాల్సి ఉంటుంది. మరోవైపు, నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులు, ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ దేవాలయం, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధభవన్ వెనుక, ఆదర్శనగర్, బీఆర్‌కే భవన్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. ప్రభుత్వం తరఫున కూడా పర్యావరణ హిత నిమజ్జనం కోసం 10 బేబీ పాండ్లు, 8 పోర్టబుల్ వాటర్ ట్యాంకులు, 8 ఎక్స్కవేషన్ పాండ్లను సిద్ధం చేశారు. ఏదైనా సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు 040-27852482, 8712660600, 9010203626 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# రోడ్లు బాగాలేవు..
# మీరెంత ఫైన్ కడతారు

హెల్మెట్ లేకపోతే భారీగా ఫైన్లు వేస్తారు. కానీ, అదే ప్రజలు ప్రయాణించే రోడ్లు సరిగా లేనప్పుడు, గుంతల వల్ల ప్రమాదాలు జరుగుతున్నప్పుడు అధికారులను ఎవరు ప్రశ్నించాలనేది ప్రధాన ప్రశ్న. ఇదే ప్రశ్నతో శ్యామ్ కుమార్ అనే యువకుడు ధర్నాకు దిగి, ప్రజలందరి ఆలోచనలకు గొంతుకగా నిలిచాడు. గుంతల రోడ్ల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను, అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, "మా దగ్గర డాక్యుమెంట్లు లేకపోతే ఫైన్ కడుతున్నాం. మరి మీరు ఈ గుంతల రోడ్లకు మాకెంత ఫైన్ కడతారు?" అని ప్లకార్డుతో నిరసన తెలిపాడు. అతని ఈ వినూత్న నిరసన సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాకుండా, వేలాది మంది నెటిజన్ల మద్దతు దక్కింది. శ్యామ్ కుమార్ నిరసన కేవలం ఒక వ్యక్తి ఆవేదన కాదు, అది రోడ్ల సమస్యలతో సతమతమవుతున్న ప్రతి పౌరుడి హృదయం నుండి వచ్చిన నిరసన. ఇది ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకున్న నమ్మకం సన్నగిల్లుతోందని, బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులకు పౌరులు ఇకపై లొంగరని సూచిస్తుంది. ఈ సంఘటన అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను ఎంత త్వరగా పరిష్కరించాలనే అవసరాన్ని గుర్తు చేస్తుంది. కేవలం నిబంధనల అమలుపైనే కాకుండా, మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించాల్సిన బాధ్యత వారిపై ఉందని ఈ నిరసన నిరూపించింది.

# కేసీఆర్ బాటలో నడుస్తూ సామాజిక తెలంగాణ సాధిస్తారా.?

కుమార్తె కవిత, తండ్రి స్థాపించిన భారతీయ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చి, ఆయన మార్గంలోనే నడుస్తూ కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తారా అనే చర్చ మొదలైంది. కేసీఆర్ ప్రస్థానం ఉద్యమపరంగా, రాజకీయపరంగా ఒక చరిత్ర సృష్టించింది. అదే రీతిలో కల్వకుంట్ల కవిత ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో ఎలా ఉండనుందనే చర్చ నడుస్తోంది. వీరిద్దరి రాజీనామాల పర్వానికి దారితీసిన పరిస్థితులపై ఈ కథనం విశ్లేషిస్తుంది.

### టీడీపీకి రాజీనామా చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

2001 వరకు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలుగుదేశం పార్టీలో ఒక సాధారణ నేతగా మాత్రమే గుర్తింపు పొందారు. అయితే తన రాజకీయ సామర్థ్యంతో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ వంటి పదవులను అలంకరించారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించలేదన్న భావన, మంత్రి పదవి ఇవ్వలేదన్న ఆగ్రహంతోనే కేసీఆర్ టీడీపీ సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. మరికొందరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పదవులను త్యాగం చేశారని అంటారు. ఏది ఏమైనప్పటికీ, టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, 2001లో కేసీఆర్ తెలంగాణ సాధనే తన లక్ష్యమని ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు. అప్పటి నుంచి ఆయన ఉద్యమ కార్యాచరణలో, ఎన్నికల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఆ తర్వాత 2014 నుంచి 2023 వరకు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించారు. ఇలా ఆనాడు కేసీఆర్ టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసిన తర్వాత తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూసినా తెలంగాణ రాజకీయాల్లో తనదైన చరిత్రను లిఖించుకున్నారు.

### 2006 నుంచి ప్రారంభమైన కల్వకుంట్ల కవిత రాజకీయ ప్రస్థానం

అమెరికాలో ఉన్న కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత 2006లో తెలంగాణ రాజకీయాల్లో అడుగుపెట్టారు. అదే ఏడాది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అనే లక్ష్యంతో తెలంగాణ జాగృతి అనే సంస్థను స్థాపించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేయడంలో ఆమె కృషి చేశారు. 2006 నుంచి తెలంగాణ వచ్చే వరకు అంటే 2014 వరకూ అనేక ఉద్యమ కార్యాచరణలలో ఆమె భాగస్వామిగా ఉన్నారు. 2014లో నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఉంటూనే ఇటీవలే పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, పార్టీ లైన్‌కు భిన్నంగా తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం వంటివి ఆమె చేశారు. అయితే పార్టీ సీనియర్ లీడర్ హరీశ్ రావు, మరో కీలక నేత సంతోష్ రావు తనపై కుట్రలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి వారే కారకులని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో పార్టీ అధ్యక్షుడు, తండ్రి అయిన కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఆమె తన పదవులకు రాజీనామా చేశారు. ఇక తన కార్యాచరణ తనది అని ఆమె మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.

### తండ్రి బాటలో తనయ నడుస్తారా.?

ఆనాడు కేసీఆర్ రాజీనామా వ్యవహారం, ఈనాడు కవిత రాజీనామా వ్యవహారం చూస్తే, ఇద్దరూ మరో కొత్త రాజకీయానికి తెరలేపేందుకే అన్న పోలిక స్పష్టంగా తెలుస్తోంది. ఆనాడు కేసీఆర్ టీడీపీలో అవమానాలు భరించలేక, పార్టీలో గుర్తింపు లభించకపోవడం, మంత్రి పదవిని ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసినట్లు చెబుతారు. కవిత కూడా అదే రీతిలో పార్టీలో అంతర్గత సంక్షోభం, నాయకత్వంపై ఆగ్రహంతోను, తనకు సరైన గుర్తింపు ఇవ్వకుండా కుట్రలు చేస్తున్నారన్న కారణాల వల్లే బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం జరిగిందని తెలుస్తోంది. అయితే ఆనాడు కేసీఆర్‌కు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనే ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆయన రాజీనామా నిర్ణయం తీసుకోవడం వల్ల కొత్త పార్టీ పెట్టి లక్ష్యాన్ని సాధించగలిగారు. కవిత తన భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత ఇవ్వకపోయినా, 'సామాజిక తెలంగాణ' అనే లక్ష్యం పెట్టుకుని పని చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి మాదిరిగానే పార్టీని స్థాపించి, ఆ పార్టీ ద్వారా సామాజిక తెలంగాణ అంటే అన్ని వర్గాల వారికి సమాన వాటా అనే నినాదంతో ముఖ్యంగా బీసీ వర్గాలను ఆకట్టుకునేలా కార్యాచరణ ఉంటుందని తెలుస్తోంది. అయితే తండ్రి బాటలో నడిచి ఆమె సక్సెస్ అవుతారా, ప్రజలు కవిత రాజకీయ ప్రస్థానానికి మద్దతుగా నిలుస్తారా లేదా అన్నది మాత్రం వేచి చూడాలి.

## కడపలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం

# జాతీయ సమావేశాలు జయప్రదం చేయండి

**- గ్రామీణ రైతులు వ్యవసాయ కూలీలు ఐక్యంగా ప్రతిఘటించాలి - కరపత్రాలు ఆవిష్కరించిన వడ్డెర సంఘం నాయకులు**



**బద్వేలు** బద్వేల్ సుందరయ్య కాలనీ నందు గురువారంఅఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు సెప్టెంబర్ 8,9,10 తేదీలలో కడప నగరంలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ , రమణయ్య ,బి ,గంగయ్య ,జిల్లా నాయకులు టీ ,సునీల్ మాట్లాడుతూ కడప జిల్లా సమగ్ర అభివృద్ధి కి పేదలకు వ్యవసాయ భూమి, ఇళ్ల స్థలాలు, తాగునీరు , సాగునీరు , జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి 26 వేల మందికి సాగుభూమి, వేలాదిమందికి ఇళ్ల స్థలాలు సాధించిందని, నిరంతరం రైతు గ్రామీణ పేదల కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని, సామాజిక న్యాయం మతసామరస్యం కోసం సంక్షేమ పథకాలు పేదలకు అందాలని ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుంది. అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ ట్రంప్ మనదేశ వ్యవసాయ, చేనేత రంగాన్ని, చిన్న పరిశ్రమలను దెబ్బతీయడానికి 100% దిగుమతి సుంకాలు విధించి మన దేశ రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీయడానికి పూనుకుంటుంది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైతాంగ హక్కులు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ అమలు కోసం అనేక ఉద్యమాలు చేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కడప నగరంలో 2025 సెప్టెంబర్ 8 న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాల సందర్భంగా భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతున్నదని ఈ సభలకు ముఖ్య అతిథులుగా కేరళ లెఫ్ట్ ఫ్రంట్ నాయకులు ఏ.విజయ రాఘవన్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి. వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు విక్రమ్ సింగ్, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జాతీయ కన్వీనర్ లలితా బాలన్, కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ చంద్రన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ రైతు సంఘాల నాయకులు పాల్గొంటున్నారని కావున జిల్లా నలుమూలల నుండి రైతులు వ్యవసాయ కార్మికులు, కర్షకులు, మేధావులు ,కళాకారులు , ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య ,వెంకటరమణ ,చందు ,వెంకటయ్య ,చంద్రశేఖర్ ,రాములమ్మ , నారాయణమ్మ ,వెంకట సుబ్బమ్మ ,రవణమ్మ , రోషమ్మ ,దేవి ,తదితరులు పాల్గొన్నారు

# గణనాథుల నిమజ్జనం ఘనంగా జరుపుకోవాలి

**- జిల్లా ఎస్పీ: రావుల గిరిధర్**



**వనపర్తి** జిల్లాలో ఈనెల 5వతేదీన వినాయక నిమజ్జనాలు భక్తిప్రపత్తులతో పరస్పర సహకారంతో శోభాయాత్రలు నిర్వహించి, గణపయ్యలకు జిల్లావ్యాప్తంగా ఘనమైన వీడ్కోలు పలుకుదామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ అన్నారు.గణేశ్ నవరాత్రులు ముగించుకొని వనపర్తి జిల్లాలో వివిధ ప్రాంతాల వద్ద నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ఎలాంటి అవాంచనియా సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రత, బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. గురువారం రోజు వనపర్తి పట్టణం నల్లచెరువు వద్ద నిమజ్జనం జరిగే ప్రదేశాన్ని, నిమజ్జన శోభయాత్ర జరిగే రూట్ ను జిల్లా ఎస్పీ ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... నిమజ్జన సమయంలో పోలీసు వారి యొక్క సూచనలకు అనుగుణముగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతముగా నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పోలీసు పికెట్లు, ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మత్తు, ఫ్లడ్ లైట్లు, క్రేన్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశామని, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజఈతగాళ్ల అందుబాటులో ఉంటారన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేయడం జరిగింది అన్నారు. అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉంటుందన్నారు. గణేష్ ఉత్సవ కమిటీలు త్వరితగతిన పూజలు ముగించి వెలుతురు ఉండగానే తమ విగ్రహాలను జాగ్రత్తగా తరలించాలని ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చిన్న పిల్లలు మహిళలు శోభ యాత్రలో పాల్గొంటే ప్రమాదాలు జరగకుండా చూడాలని అలాగే ట్రాక్టర్ల, లారీలపై, ఇతర వాహనాలపై వచ్చే చిన్నారులు జాగ్రత్తగా ప్రయాణించాలని కాళ్ల చేతులు క్రిందకు వేలాడస్తు ప్రయాణం సాగించవద్దని పొరపాటున కాలుజారి పడిపోతే ప్రమాదం సంభవిస్తుందని అన్నారు. నిమజ్జనం సమయంలో, క్రేన్ సహాయంతో నిమజ్జనం చేసే సమయంలో యువత చిన్నారులు మహిళలు అప్రమత్తంగా ఉండాలని సహాయకులు అందుబాటులో ఉండాలని అన్నారు .నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు సమయంలో డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి నిషేధమని సూచించారు. నిమజ్జనానికి వస్తున్న భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది అన్నారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా నియమ నిబంధనలను పాటిస్తూ పోలీసువారి సూచనలను పాటించాలని కోరారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రులను ముగించుకొని ఆఖరున జరిగే నిమజ్జన కార్యక్రమాన్ని మత సామరస్యంతో,శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వెంకటేశ్వర్లు, వనపర్తి సీఐ, కృష్ణయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్, శ్రీనివాస్, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కొత్తపల్లి-హుస్నాబాద్ 4 లైన్ పనులపై సమీక్ష

**- కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్** కరీంనగర్– కొత్తపల్లి హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణం వేగవంతం కోసం అవసరమైన చర్యలపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సంబంధిత అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. నాలుగు వరుసల రహదారి కోసం ఇప్పటికే మార్కింగ్ పూర్తయినందున ఎలక్ట్రికల్ వర్క్స్, బావుల పూడ్చివేత, చెట్లు కత్తిరించడం వంటి పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఇప్పుడున్న రహదారిని వెడల్పు చేస్తున్నందున గ్రామాల గుండా వెళ్తున్న రహదారి నిర్మాణం కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని అన్నారు. అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించడం, కొత్త లైన్ ఏర్పాటు చేయడం వంటి పనులను వేగవంతం చేయాలని అన్నారు. హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నిర్మించనున్న ఈ రోడ్డు కోసం కరీంనగర్ జిల్లా పరిధిలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి తదితర గ్రామాల పరిధిలో రోడ్డును ఆనుకొని ఉన్న బావులను పూడ్చివేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి, ఆర్ అండ్ బి ఈఈ నరసింహాచారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ ధర పలికిన మై హోమ్ భూజా లడ్డు

**హైదరాబాద్** మాదాపూర్ లోని మై హోమ్ భూజా లో హోరాహోరీగా సాగిన గణనాదుడి లడ్డు వేలం పాట రికార్డులను బ్రేక్ చేసింది. గణేష్ రియల్ ఎస్టేట్ అధినేత వేలం పాటలో లడ్డు దక్కించుకున్నారు. ఏకంగా 51,777,77లక్షలకు గణేష్ లడ్డు ను గణేష్ రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ గణేష్ సరిత దంపతులు కైవసం చేసుకున్నారు. గత ఏడాది లడ్డు ధర 29లక్షలు పలికింది, అప్పుడు కూడా గణేష్ రియల్ ఎస్టేట్ అధినేత దక్కించుకోవడం విశేషం.

## ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదగాలి

**ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎంఏ అధ్యక్షుడు దేవేందర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు**

వాస్తవిక ప్రపంచ దృక్పథాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను సమన్వయం చేసుకుంటూ నాయకత్వ నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవడం ద్వారా విద్యార్థులు.. ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని హెచ్ఎంఏ (హైదరాబాద్ మేనేజ్మెంట్ అసోసియేషన్) అధ్యక్షుడు అల్వాల దేవేందర్రెడ్డి అభిలషించారు.

హెచ్ఎంఏ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ నాగార్జున సర్కిల్లోని లండన్ మేనేజ్మెంట్ అకాడమిలో ఎంటర్ప్రెన్యూర్షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా దేవేందర్రెడ్డి మాట్లాడుతూ నగరంలో దాదాపు 150 మేనేజ్మెంట్ కళాశాలలు ఉన్నాయని, ఏటా 12వేలకు పైగా విద్యార్థులు ఎంబీఏ పూర్తిచేస్తున్నారని, వీరిలో దాదాపు 60–70% ఉద్యోగులుగా కొనసాగుతున్నారని చెప్పారు. విద్యార్థులను వాస్తవిక విపణి పరిస్థితి, పరిశ్రమలకు అనుగుణంగా రూపొందించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఏ స్టూడెంట్ చాప్టర్ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ సుప్రియ శ్రీవాత్సవ, అధ్యాపకురాలు షితా వార్షే, హెచ్ఎంఏ కార్యదర్శి వాసుదేవన్, పూర్వ అధ్యక్షులు చంద్రశేఖర్, నగేశ్ విశ్వనాథం, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

## వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది

**ప్రభుత్వం మిమ్మల్ని కచ్చితంగా ఆదుకుంటుంది**

**కామారెడ్డి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కామారెడ్డి జిల్లా వరద ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. సీఎం మాట్లాడుతూ వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది. ప్రభుత్వం మిమ్మల్ని కచ్చితంగా ఆదుకుంటుంది. మీ ఎమ్మెల్యే మదన్ మోహన్ మీకు అండగా నిలిచి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చూశారని అన్నారు.కష్టం వచ్చినపుడు అండగా ఉండే వాడే నాయకుడు.

మీకు అండగా ఉండి ఎమ్మెల్యే అడ్డుకున్నారు. కష్టాల్లో ఉన్నపుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా. వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు దెబ్బతిన్నాయి . పోచారం ప్రాజెక్టు వరదలకు తట్టుకుని నిలబడి మిమ్మల్ని కాపాడింది. తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేశాం. ప్రత్యక్షంగా మీ కష్టాలను, జరిగిన నష్టాలను చూడటానికే ఇక్కడకు వచ్చాం. శాశ్వత పరిష్కారం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించాం. పంటపొలాల్లో ఇసుక మేటలు తొలగించుకునేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తాం. పంట నష్టపరిహారం అందిస్తాం . రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు అధికారులు అంచనాలు రూపొందించాలని అన్నారు.అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులు పూర్తిస్థాయిలో వరద నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు.

# మా బంధం దౌత్యానికి మించినది

దార్శనికతతో ముందుకు సాగుతున్నాయని మోదీ అన్నారు. సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లారెన్స్ వాంగ్ భారత్లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత లభించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, “భారత్ ‘యాక్ట్ ఈస్ట్’ విధానంలో సింగపూర్ ఒక కీలకమైన స్తంభం లాంటిది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం ఆసియాన్తో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం” అని పేర్కొన్నారు.భవిష్యత్ భాగస్వామ్యం కోసం ఒక స్పష్టమైన రోడ్మ్యాప్ను సిద్ధం చేసినట్లు ప్రధాని వెల్లడించారు. ఇకపై సహకారం అధునాతన తయారీ, గ్రీన్ షిప్పింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీ, పట్టణ నీటి నిర్వహణ వంటి నూతన రంగాలకు విస్తరిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సహకారంతో చెన్నైలో ‘నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్’ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తీర్చిదిద్దుతామని వివరించారు. డిజిటల్ కనెక్టివిటీలో భాగంగా ఇప్పటికే విజయవంతమైన యూపీఐ–పేనౌ అనుసంధానంలో కొత్తగా మరో 13 భారతీయ బ్యాంకులు చేరినట్లు మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందంతో పాటు, ఆసియాన్తో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కూడా నిర్ణీత సమయంలో సమీక్షించాలని ఇరు దేశాలు నిర్ణయించాయని ఆయన పేర్కొన్నారు. గుజరాత్లోని గిఫ్ట్ సిటీ ఇరు దేశాల స్టాక్ మార్కెట్లను కలుపుతూ ఒక వారధిగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆగ్నేయాసియాలో సింగపూర్ భారత్కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని, రక్షణ సంబంధాలు కూడా రోజురోజుకు బలపడుతున్నాయని ఆయన గుర్తు చేశారు.

## జీఎస్టీ లో భారీ తగ్గింపులపై హర్షం

**బిజెపి రాష్ట్ర నేత పాతూరి సుధాకర్ రెడ్డి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం వచ్చే దీపావళి సందర్భంగా దేశ ప్రజలకు అద్భుతమైన ఆశ్చర్యకరమైన జీఎస్టీ తగ్గింపులు మినాయింపులతో శుభవార్త చెప్పడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బిజెపి రాష్ట్ర నేత పాతూరి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. జీవితాల్లో కూడా ఎంతోకొంత ఆర్థిక ఊరట కలిగిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ కొద్ది రోజుల క్రితం ప్రకటించారని గుర్తు చేశారు . దాని అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం అధికారికంగా దీపావళి సందర్భంగా జీఎస్టీ లో భారీగా తగ్గింపులను ప్రకటించిందని.కేంద్ర ప్రభుత్వం జిఎస్టి అమలు చేసిన ఏడు సంవత్సరాల క్రితం ఉన్న ఆదాయానికి ఇప్పటి ఆదాయానికి అనేక రేట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల నుండి పన్నులు వస్తున్నాయన్నారు. అందుకే ప్రధానమంత్రి మోడీ జీఎస్టీ లో ఆర్థిక సంస్కరణలతో పేద మధ్య తరగతి ప్రజల ఆహార పదార్థాలు, విద్యా వైద్య చాలా వస్తువుల పైన పూర్తిగా జిఎస్టి ను తొలగించారని తెలిపారు. పెట్రోల్ డీజిల్ పారిశ్రామిక రంగాల్లో మెకానిక్ ఎలక్ట్రికల్ స్కూటర్,కార్ బైక్ లు అన్ని రకాల వస్తువులపై భారీ జీఎస్టీ ని తగ్గించారని ఇది భారత దేశ ప్రతి పౌరుడు వినిమయ వస్తువులు ఎంతో కొంత చౌకగా లభిస్తాయని ఇది పేద మధ్యతరగతి ఖర్చుల్లో దాదాపు 10 నుండి 20 శాతం ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలోని పారిశ్రామిక వాణిజ్య హోల్ సేల్ రిటైల్ హోటల్ అన్ని రకాల వ్యాపారులు తమ వ్యాపారాన్ని కచ్చితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్ట ప్రకారం పన్నులు కట్టాలని. ఇది 140 కోట్ల దేశ ప్రజల దేశ సంపద వినిమయ వస్తువులపై ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వల్ల ప్రపంచంలోనే భారతదేశం అధిక ఆర్థిక లావాదేవులు కలిగిన దేశంగా మారుతుందన్నారు. అన్ని రకాల వ్యాపారాలు చేసేవాళ్లు నిజాయితీగా కచ్చితంగా ప్రతి వస్తువుపై జీఎస్టీ పన్నులు కట్టాలి. కట్టని వారిపై కఠిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు.

## ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆర్డీవో

**అమలాపురం** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఆర్డీఓ కె.మాధవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరుపై అటెండెన్స్ రిజిస్టర్ ను ఆర్డీఓ తనిఖీ చేశారు. ఆర్డీఓ తనిఖీలో నలుగురు వైద్యులు, మెడికల్ సూపరింటెండెంట్ విధులకు డుమ్మా కొట్టినట్లు తేలింది.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి విధులకు వైద్యులు సక్రమంగా హాజరు కావడం లేదని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేయమని ఆర్డీఓ కు ఆదేశాలు ఇచ్చారు. ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై కూడా ఆర్డీఓ ఆరా తీశారు. రోగులను చులకనగా చూస్తున్నారని వైద్యులు డ్యూటీకి రావడం లేదని ఒక రోగి బంధువు ఆర్డీఓ కు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి తనిఖీ సందర్భంగా తమ దృష్టికి వచ్చిన విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదిక ఇచ్చినట్లు మాధవి తెలిపారు.

### సరిహద్దు చెక్ పోస్టుల దగ్గర

## అధికారుల ఆకస్మిక తనిఖీలు

**పల్నాడు** కలెక్టర్ పి. అరున్ బాబు అదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జగ్గారావు దాచేపల్లి మండలంలోని అంతరరాష్ట్ర సరిహద్దు పొందుగల, తంగెడ వద్ద బుధవారం రాత్రి అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. చెకోపోస్టుల వద్ద 24 గంటలూ వాహనాల తనిఖీ చేయాలని, అను మానాస్పద వాహనాలను పరిశీలించాలని అదే శించారు. అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం?లో ఏడీఏలు హనుమంతరావు, శ్రీ కృష్ణదేవరాయలు, జగదీశ్వరావు, తహసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఏవోలు వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

## పాఠాలు చెప్పాల్సిన పండితుడు

**పీకలదాకా తాగొచ్చాడు..ఇంకేముంది!..**

**కొమురం** పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన పంతులు.. పట్టపగలే పీకల దాకా తాగి పడిపోయాడు. చదువు చెప్పేవారు లేక పిల్లలంతా బిక్క మొహం వేశారు. ఈ ఘటన కొమురం భీమ్ జిల్లాలో చోటు చేసుకుంది. జైనూర్ మండలం సుకుద్పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీ గీఆ పనిచేస్తున్న విలాస్ మద్యం సేవించి విధులకు హాజరయ్యాడు. తరగతి గదిలోకి వచ్చి పిల్లలకు చదువు చెప్పకుండా టేబుల్ దగ్గర పడిపోయాడు. ఇదంతా గమనించిన గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారులు విచారణ చేపట్టారు.దీంతో ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారులు విచారణ చేపట్టారు. అధికారుల నివేదికతో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఎస్జీటీ విలాస్ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

## జర మమ్మల్ని పట్టించుకోండి సార్లు

**మహబూబాబాద్ :** మహబూబాబాద్ పట్టణంలో చెత్త సేకరణ కోసం తడి, పొడి( డస్ట్ బిన్స్ ) బకెట్లు మున్సిపాలిటీ ద్వారా గతంలో ఏర్పాటు చేసిన చెత్త బకెట్లు కాలక్రమమైన కనుమరుగవ్వడం జరిగింది. వార్డులలో ప్రధాన రహదారుల లో ఏర్పాటు చేసినటువంటి చెత్త బకెట్లో ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపాలిటీ వారు ఇచ్చినటువంటి పిలుపుతో ప్రజలంతా సహకరిస్తూ మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన నూతన విధానపు తడి, పొడిచెత్త సేకరణ బకెట్ల లో చెత్తను వేస్తూ మున్సిపాలిటీకి సహకరిస్తూ, శుభ్రతను జీవనశైలిలో భాగంగా అలవాటు చేసుకోవడం జరిగింది. మున్సిపాలిటీ అధికారులు ప్రధాన రహదారుల లో చెత్తను శుభ్రపరుస్తూ, వార్డులలో చెత్త వేసే ప్రాంతంలో బకెట్స్ లేకపోయినా అలవాటుగా అక్కడే పడవ వేయడంతో , ఆ ప్రాంతం చెత్తతో నిండి దుర్వాసనలు వెదజల్లుతూ, అపరిశుభ్రంగా కాలనీలు దర్శనమిస్తు ఉండడంతో పందులు స్వైర విహారం చేస్తూ, ఆ చెత్తా చెదారం వలన ఈగలు, దోమలు అధికముగా పెరుగుతూ, ఇంటి పరిసరాల ప్రాంతాలలో చేరి , కుటుంబాలు అనారోగ్య సమస్యలకు, పరోక్షంగా కారణమవుతున్నాయి.మునిసిపాలిటీ అధికారులు, నామ మాత్రపూ శుబ్రాతను పాటిస్తూ, పట్టించుకోక పోవడంతో స్థానికంగా నివసించే ప్రజల ఇండ్లలో బకెట్లు నిండి చెత్త క్రింద పడుతూ, చెత్త నుండి వచ్చే దుర్వాసన లతో బాధపడుతున్నమని ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఇకనైనను, (డస్ట్ బిన్స్ ) తడి, పొడి చెత్త బకెట్లను అన్ని వార్డులలో ఎక్కువగా ఏర్పాటు చేసి, ప్రతిరోజు చెత్తను తరలించ వలసినదిగా , డ్రైనేజీలు శుభ్రపరచ వలసిందిగా, ప్రజలందరూ మున్సిపాలిటీ అధికారులకు , ప్రజా ప్రతినిధులకు విన్నవించు కుంటున్నారు.

## ధర్పల్లి మండలం వాడీ గ్రామంలో వైద్య శిబిరం




ధర్పల్లి (ప్రశ్న న్యూస్)నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఆదేశాల మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ ఐ యం ఎ డిచ్పల్లి మెడికల్ కాలేజ్ ,ఆసుపత్రి సి యం సి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం తొమ్మిది గంటల నుండి పన్నెండు గంటల వరకు ధర్పల్లి మండలం లోని వాడి గ్రామ ప్రజలకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వారం రోజుల ముందు జరిగిన ముత్యాలరావు ముత్యాల చెరువు తెగిపోవడం మూలంగా అధిక మొత్తంలో నీరు ఇళ్లలోకి చేరి వాటిలోని దోమలు తయారై మలేరియా లాంటి రోగాలు ఏర్పడతాయని ముందస్తుగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో అధ్యక్షులు డా. అజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ గత వారం అదిక వర్షాలతో వాడి గ్రామంలోకి వరదలు వచ్చాయి వాటి కారణంగా ప్రజలకు చర్మ వ్యాధులు, అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్తతో ఐ యం ఎ నిజామాబాద్ వారు సేవ దృక్పధంతో వచ్చి వాడి గ్రామ ప్రజలకు బి పి, షుగర్ పరిక్షలు నిర్వహించారని అన్నారు. అనారోగ్య సమస్యలు ప్రబలకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని, మంచి పోషక పదార్థాలు తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల స్పెషలిస్టు వైద్యులు వాడి గ్రామ ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపణి చెసారు. ఇలా మమ్ములను గుర్తించి మాకు ఇంత వైద్యం చేపిస్తున్న మన నిజాంబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జిల్లా బిజెపి అధ్యక్షులు దినేష్ కులాచారీ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ యం ఏ జిల్లా అధ్యక్షులు డా. అజ్జ శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి డా. విక్రం రెడ్డి, వైద్యులు డా. వినోద్ కుమార్ గుప్తా, చిన్న పిల్లల వైద్యులు డా. శ్రీశైలం, ఎముకల వైద్యులు డా. రాందాస్ చర్మవ్యాధి నిపుణులు డా. మధుకర్ , డా. హేమ చక్రపాణి, డా. భక్త సింగ్, డా. ప్రతిభ, ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షులు జిర్ర మహిపాల్, కర్క గంగారెడ్డి, మోహన్ రెడ్డి,రవీందర్, సరిచంద్, అమృత్ నాయిక్, సేవలాల్, తిరుపతి, శ్రీకాంత్, సాగర్, సందీప్, వాడి బిజేపి కార్యకర్తలు రెండు వందల మంది గ్రామ ప్రజలు , సిబ్బంది, లాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం - ఏఐఎస్బీ తీవ్ర విమర్శ

**- స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలి**

**- ఏఐఎస్బీ రాష్ట్ర నాయకులు : అతికం రాజశేఖర్ గౌడ్**



గంగాధర (ప్రశ్న న్యూస్) పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్బీ రాష్ట్ర నాయకులు అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం గంగాధర మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, "ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చింది. కానీ వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది" అని విమర్శించారు. స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు రాక రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కళాశాల యాజమాన్యాలు టీసీలు, మెమోలు ఇవ్వడం కోసం అదనపు డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. వెంటనే నిధులు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లపల్లి గణేష్,మెట్టు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి పేరుతో ఎంతోమంది నాయకులు ఉన్నత పదవులు పొందారు: రామిడి వెంకట్ రెడ్డి

**తెలంగాణ జాగృతి పేరుతో ఉన్నత పదవులు పొందింది ఎవరు**

**కవితక్క చేసిన సేవలతో జాగృతికి ఎంతో పేరు వచ్చింది**

**కొంతమంది నాయకులు తిన్నింటి వాసాలను లెక్కబెడతారు**

**పదవులు వస్తాయి పోతాయి మాట ఇచ్చి**

**మడమ తిప్పక పోవడమే కవితక్క నైజం**

**తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తాం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాట ఇచ్చి మడమ తిప్పకపోవడమే కవితక్క నిజమని తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ జాగృతి చేసిన ఉద్యమాలను తెలంగాణ జాగృతి పేరుతో కొంతమంది నాయకులు పదవులు అనుభవించి తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు రామిడి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జాగృతి చేసిన ఉద్యమాలను మరిచారా? చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే కొంతమంది నాయకులు కవితక్క గురించి మాట్లాడడం విడ్డూరమని తెలంగాణ జాగృతి లో కొంతమంది నాయకులు చేసిన సేవలను గుర్తించే కవితక్క పదవులను ఇప్పించిందని, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు దైవ సమానులని ఎప్పుడు పార్టీని కానీ నాయకున్ని కానీ విమర్శించిన దాఖలాలు ఎక్కడా లేవని, పార్టీలో కొంతమంది నాయకులు చేస్తున్న ద్రోహాన్ని కవితక్క వివరించారని, ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కొంతమంది నాయకులు జీర్ణించుకోలేక బీఆర్ఎస్ పార్టీ అధినేత పై ఒత్తిడి తీసుకొచ్చారని, ఎప్పటికైనా మా అందరికీ రాజకీయ గురువు కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని కొంతమంది జాగృతి నాయకులు ఇష్టం వచ్చినట్టు కవితక్క గురించి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని, తిన్నింటి వాసాలు లెక్కపెట్టే నాయకులారా ఇకనైనా కవితక్క గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని లేదు అంటే మూల్యం చెల్లించుకోక తప్పదని ఈ సందర్భంగా రామిడి వెంకట్ రెడ్డి అన్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే నాయకులారా తెలంగాణ జాగృతి చేసిన సేవలు తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కవితక్క చేసిన సేవలను మర్చిపోయారా అని అన్నారు. కవితక్క పై ఆరోపణలు చేస్తే పెద్ద నాయకులం అయిపోతామని అనుకోవడం వెర్రి తక్కువ పని అని కవితక్క లేకపోతే మీకు రాష్ట్రస్థాయిలో పదవులు వచ్చేవా అని ప్రశ్నించారు? తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధనకై పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర తెలంగాణ జాగృతి కి చెందుతుందని, బహుజనులకు 42% రిజర్వేషన్ కల్పించడంలో కవితక్క చేస్తున్న ఉద్యమం లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తెలంగాణ జాగృతి నాయకులు వెన్నుదండగా నిలుస్తామని ఈ సందర్భంగా రామిడి వెంకట్ రెడ్డి అన్నారు.

## తరగతి గదిలో తలరాతలు మార్చే

# గురువులకు సన్మానం

- **విశ్వవానికే విజ్ఞానాన్ని అందించే ఆది గురువులారా ఇవే మా వందనాలు.. ఎమ్మెల్యే శ్రీ గణేష్**
- **మూడున్నర దశాబ్దాల చరిత్ర తిరగరాసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే**
- **తిరుమలగిరి మండలం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు నా భూతో నా భవిష్యత్ అందని గౌరవం నిన్న సభలో సన్మానం**
- **గురు నామ స్మరణతో విద్యార్థులు ఆటపాటలతో అందరినీ అలరించారు**
- **కూచిపూడి నృత్యంతో అందరు ఆనందంలో తడిసి ముద్దయ్యనా గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులు**
- **ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉత్సాహాన్నిచ్చే కారిక్రమాన్ని ఏర్పాటు చేశారని పొగడ్తలతో ఎమ్మెల్యేని ముంచెత్తారు రిటైర్ టిచర్స**
- **కార్పొరేట్ స్కూల్స్ కి దీటుగా చిలకపలుకుల మాటలు, రంగు రంగుల అవతారాల్లో డ్యాన్సతో అదరగొట్టిన పిల్లలు**
- **శ్రీ గణేష్ ఫౌండేషన్ ద్వారా మరోసారి టిచర్స్ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్**
- **ప్రపంచానికి వెలుగును ఇచ్చేది సూర్యుడైతే సమాజానికి వెలుగునిచ్చేది ఉపాధ్యాయులేకంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** మనిషి పలు వనరులు పుష్కలంగా సమకూర్చుకోవాలంటే అభివృద్ధికి కేంద్ర బిందువు అయినది విద్య. సమాజంలో సామాజిక ఆర్థిక వ్యవస్థల సమతౌల్యలతో విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నాణ్యమైనా జీవనానికి మంచి వ్యక్తులుగా మారటానికి మన పిల్లలు సమగ్ర అభివృద్ధి జరగాలి, విద్యలో బలమైన పునాదులు వేయాలి. లక్ష్య సాధనలో మానవ వనరుల అభివృద్ధి రెండు విధాలుగా పని చేస్తుంది. మొదటిది పాఠశాల విద్య, రెండవది ఉన్నత విద్య వ్యక్తి పరిపూర్ణం చెందితే స్థాయి ఉహించని స్థాయిలో ఉంచుతుంది. విద్యార్థి దశలో... పాఠశాలలో క్రీడలు పిల్లలకు,విద్య వ్యవస్థకు అపారమైన ప్రయోజనాలు కలుగజేస్తాయి. ఆటలు శారీరక ప్రభవశీల, సామాజిక,జ్ఞానాత్మక అంశాలఅభివృద్ధికి సహాయపడే విధంగా ఉంటాయి. సాంఘికనైపుణ్యాలు సామాజిక ప్రవర్తనలు జీవనశైలి ఆత్మగౌరవం,స్కూల్ అనుకూలమైన వైఖర్లను పదును పెట్టడంలో క్రీడలు ఎంతో దోహదం చేస్తాయి. ప్రతిఒక క్రీడకు ఓ ప్రత్యేకత ఉంటుందని దాని విలువ తెలిసినప్పుడే పట్టుదల పెరుగుతుంది. అలాగే క్రీడలు సమగ్ర శారీరక మానసిక అభివృద్ధికి సహాయపడే విధంగా వ్యవహరిస్తాయి. ఆరోగ్యం కోసం ఏరోబిక్ శారీరక వ్యాయామాల పాత్ర పై అవగాహన పెంచుతుంది, అలాగే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆటలు విద్యార్థిల్లో పోటీ తత్వాన్ని పెంచడమే కాకుండా సమాజంలో మంచి గుర్తింపు పొందవచ్చు. ప్రస్తుతం పిల్లల పై పెరుగుతున్న నేరాలను దృష్టిలో ఉంచుకొని వారి భద్రత,రక్షణను నిర్ధారించడానికి పాఠశాలలో ఆత్మరక్షణ లేదా స్వీయ రక్షణ శిక్షణ ఇవ్వడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఆత్మరక్షన శిక్షణ అనేది ఆడపిల్లలు తమ పరిసరాల గురించి మరింత తెలుసుకొని ఎప్పుడైనా ఉహించని పరిస్థితులు ఎదురైతే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడానికి సహాయపడే జీవన నైపుణ్యం ఆత్మ రక్షణ శిక్షణ ద్వారా ఆడపిల్లలు తమను తామే రక్షించుకోవడానికి మానసికంగా మేధో పరంగా, శారీరకంగా బలంగా ఉండడం వల్ల ఎదుటి వాళ్లను చిత్తు చేయగలరు. నిన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులకు పాఠాలు నేర్పే అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమైనదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నేపథ్యంలో కంటోన్మెంట్ లోని ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలకు చెందిన అధ్యాపకులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. (విశ్రాంతి ఉద్యోగులు)ఉద్యోగ విరమణ పొందిన అధ్యాపకులతో పాటు ప్రస్తుతం విధులలో ఉన్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు వారి సేవలను గుర్తించి ప్రశంస పత్రంతో పాటు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ భావితరాలకు విద్యను అందించే ఉపాధ్యాయులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అన్ని పాఠశాలలో ప్రవేశపెట్టి అందరికీ సాంకేతికత పట్ల మరింత పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. పాఠశాల పూర్తయిన అనంతరం బస్తీలలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహించనునట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులుగా తాము చేస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే శ్రీ గణేష్ సన్మానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే మున్ముందు మరిన్ని నూతన కార్యక్రమాలు తీసుకుంటామని అధ్యాపకులు తెలిపారు. గురుపూజోత్సం సందర్భంగా శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉత్తమ గురువులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న గురువారం సన్మానించి,పదవీ విరమణ చేసిన గురువులకు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులనుఅందజేశారు. అనంతరం షెడ్రక్ అధ్యక్షతన జరిగిన టీచర్స్ డే వేడుకలను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ టీచర్స్ డే సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించే గురువులందరికీ టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, 2వ రాష్ట్రపతి అయిన ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని టీచర్స్ డే గా జరుపుకోవడం ఆనవాయితీ, గురు శిష్యుల బంధం అలనాటి నుంచి వస్తున్న సంబంధం. ప్రపంచంలో అన్ని రంగాలలో ఉన్న మేధావులను తీర్చిదిద్దేది ఆ స్థాయిలో ఉంచేది ఒక గురువు మాత్రమే! సిఎం నుంచి పిఎం వరకు ఈ దేశంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక గురువుకి శిష్యులే ఈ సమాజానికి భావి భారత పౌరులను అందించేది కేవలం ఉపాధ్యాయులే,విద్యతోపాటు జీవిత పాఠాలు నేర్పేది కూడా వారే. ప్రపంచంలో ఎవరూ దొంగలించలేనిది విద్య మాత్రమే, అంతపెద్ద సంపద మనకు అందించే గురువులను సన్మానించుకోవడం మనందరి బాధ్యత. ప్రతి మనిషి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే గురువుల వద్ద విద్యతో పాటు క్రమశిక్షణ కూడా నేర్చుకోవాలి, సమాజంలో కార్పొరేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడాలంటే చాలా కష్టంగా ఉంటుంది. గవర్నమెంట్ స్కూల్స్ ఉపాధ్యాయులు కూడా బస్తీలలో పర్యటించి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా విద్య యొక్క ఔన్నత్యాన్ని (గొప్పతనాన్నీ)వివరించాలి. నేడు విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)టెక్నాలజీని కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందుకోవాలి, అందుకనే రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు తీసుకువస్తుంది. దానికి గురువుల మార్గదర్శకత్వం చాలా అవసరం,నేను కూడా బస్తీల నుండి వచ్చి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఈ స్థాయికి వచ్చిన వాడినని గుర్తు చేశారు ఎమ్మెల్యే. విద్యతో పాటు క్రమశిక్షణ కూడా కలిగి వ్యాపారవేత్తగా, రాజకీయవేత్తగా పేరు తెచ్చుకుని ఈరోజు ఇలా మీ ముందు ఉన్నాను. కేవలం వ్యాపారవేత్తగానే ఉంటే సమాజ సేవ చేయడం కష్టం అని ఎమ్మెల్యే అయితే విస్తృతంగా ప్రజాసేవ చేయవచ్చని రాజకీయాల్లోకి వచ్చి విజయం సాధించాను. ఈ స్థాయికి రావడానికి కఠోరశ్రమ,గురువుల మార్గదర్శకత్వం నాకు ఉపయోగపడింది. నేను బస్తీ నుండి వచ్చినాను కాబట్టి నన్ను చూసి బస్తీ పిల్లలు మరింత మంది అభివృద్ధిలోకి వస్తారని ఆశించి ఈరోజుకీ అదే బస్తీలలో నివసిస్తున్నాను. నియోజకవర్గంలో మొదట 9 బస్తీలను మోడల్ గా ఎంపిక చేసి బస్తీలలోని పిల్లలకు, తల్లిదండ్రులకు చదువుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. బస్తీలలోని పిల్లలకు స్పోర్ట్స్,స్పోకెన్ ఇంగ్లీష్,ఎస్సే రైటింగ్,యోగా లలో తర్ఫీదు ఇస్తే మరింతమంది మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారు. మీ గురువులందరి ఆశీర్వాదంతో మా కంటోన్మెంట్ నియోజకవర్గ పేద పిల్లల భవిష్యత్తంతా ఉజ్వలంగా ఉంటుందని ఆశిస్తున్నానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ టీచర్స్ డే వేడుకలలో డిప్యూటీ డిఇఓ బాలు నాయక్ ,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మదన్మోహన్ రెడ్డి,వీరలక్ష్మి, టీచర్స్ యూనియన్ నాయకులు రామ సుబ్బారావు,విశ్రాంత ఉపాధ్యాయులు బిక్షపతి రెడ్డి నర్సింగరావు, కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బద్రీనాథ్ యాదవ్ రాజేష్ యాదవ్, సంతోష్ యాదవ్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి,రాము తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి: నాగుల కనకయ్య

**సూర్యోదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి హోమం**



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్ లో సూర్యోదయ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యోదయ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాగుల కనకయ్య మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటున్న సందర్భంగా గణపతి మండపం వద్ద గణపతి హోమం కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో సంతోషమని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్, శేఖర్,రాజు, సందీప్, రంజిత్,డీఎన్ సంతోష్, సంపత్,రాంబాబు, శ్రీనివాస్ మెడికల్, సన్నీ,పవన్, వెంకటేష్ (చింటూ),చంద్రకాంత్, శ్రావణ్, గోపి, తేజ, సిద్దు ,కార్తీక్,కిరణ్, అభి, బంటి,పిరజీ, మధు,రాహుల్,మనోజ్, రాహుల్,నవీన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గుడి అడ్డా యూత్ గణపతి మండపంలో మహిళల సహస్ర దీపాలంకరణ

**-31 రకాల పిండి వంటల ప్రసాదాల నైవేద్యం**

**- అద్భుతంగా సాగిన దీపోత్సవం**

**- పెద్ద ఎత్తున మహిళల భాగస్వామ్యం**

**- గణపతి మండపంలో ప్రత్యేక పూజలు**

**- సహస్ర దీపాలంకరణతో సంపూర్ణ ఆధ్యాత్మిక శోభ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కేంద్రంలోని "గుడి అడ్డా యూత్"ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గురువారం మహిళలు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడి ఆశీర్వాదం కోసం భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ చేసి మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. ఈ సందర్భంగా 31 రకాల పిండి వంటల నైవేద్యంతో,వేద మంత్రాల మధ్య సాంప్రదాయ పద్ధతిలో హారతులు ఇచ్చి గణనాథుడిని



కీర్తించారు. కార్యక్రమంలోమ్యాన మౌనిక, దూస మమత,బొటుకు లాస్య, దూస లావణ్య, నల్లగొండ లక్ష్మీ, శ్యామల, లలిత, గుంటి సుమిత, పుల్లరి లలిత, దూస లక్ష్మీ,దూస దేవేంద్ర,తదితర మహిళలు అధికసంఖ్యలో పాల్గొని భక్తి భావాన్ని వ్యక్తం చేశారు. గణనాథుడి ఆశీస్సులతో క్షేమం,శాంతి, శుభసమృద్ధి కలగాలని కోరుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతమంతా సంపూర్ణ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# అటవీశాఖ ఉద్యోగిని పై దాడి..!!

**- దాడి ఘటనలో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు..**




జూలూరుపాడు (ప్రశ్నన్యూస్) సెప్టెంబర్ 04: జూలూరుపాడు రేంజ్ పరిధిలోని పాపకొల్లు బీట్- బీ పరిధిలోగల రాసగానిగుట్ట కంపార్ట్మెంట్ నెంబర్ 31 ప్రాంతంలో 29.08.2025న ఉదయం 11.00 గంటల సమయంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అయిన కొలిచలం విజయలక్ష్మి, ప్లాంటేషన్ వాచర్ అయిన తేజావత్ రాము కలిసి విధులు నిర్వహిస్తుండగా, అట్టి ప్రాంతంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు మారుజాతి మొక్కలను నరికి వేసి ఉండడాన్ని గమనించినారు, అయితే అట్టి ప్రదేశము ఫారెస్ట్ కవర్ రేంజ్ పాయింట్ కనుక అట్టి ప్రదేశంలో మొక్కలు నాటవలసి యున్నది కనుక,పై అధికారుల ఆదేశానుసారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మరియు వాచర్ లు ఇద్దరు కలిసి మొక్కలు నాటుచుండగా, మొక్కలు నాటుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎలకలోడ్డు గ్రామానికి చెందిన మడి సీతారాములు, మడి ప్రవీణ్, మడి ముత్తమ్మలు అచ్చటకు వచ్చి మొక్కలు నాటడానికి వీల్లేదు, ఇచట గుత్తి కోయలు ఇలానే చెట్లను నరికి సాగు చేసుకుంటారు. మీరు అడ్డు చెబితే మీ సంగతి చూస్తాం, మిమ్ములను చంపుతామంటూ బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి మొక్కలు నాటకుండా అడ్డగించి, విధులకు ఆటంకం కలిగించినారని, పక్కనే ఉన్న గుత్తి కోయ మహిళ అయిన మడివి హీడిమా ను రెచ్చగొట్టి, తనపై దాడికి ఉసిగొల్పినాడని, సదరు మహిళ రాయితో తనను రెండు దెబ్బలు గట్టిగా కొట్టి ,జుట్టు పట్టుకొని లాగి కింద పడేసిందని, తమ వాచర్ వీడియో చిత్రీకరిస్తుంటే, వారంతా వాగు దాటి పారిపోయారని, కాసేపటికి బచ్చుల నరసమ్మ అనే మహిళ కూడా తమ వద్దకు వచ్చి, దురుసుగా ప్రవర్తించి ,అసభ్య పదజాలంతో దూషించి, చంపుతా అంటూ బెదిరించినదని, అటవీ శాఖ వారి అనుమతి లేకుండా ,అటవీ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి, 15 వేల రూపాయల విలువ చేసే చెట్లను నరికి, పత్తి పంట సాగు చేసుకుంటూ, ఎందుకు ఇలా అనుమతి లేకుండా పంటలు వేశారని ప్రశ్నించినందుకు, తమను బూతులు తిట్టి రాళ్లతో కొట్టి గాయపరిచి, మొక్కలు వేయనీయకుండా తమ విధులకు ఆటంకం కలిగించి, మరో మారు తమను ప్రశ్నిస్తే చంపుతామని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసిన, మడి సీతారాములు, ప్రవీణ్, ముత్తమ్మ , హీడిమా, నరసమ్మలపై చట్టరీత్య చర్య కొరకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కొలిచలం విజయలక్ష్మి, భర్త పేరు మాధరావు, వయసు 30 సంవత్సరములు, అను ఆమె ఫిర్యాదు ఇవ్వగా, జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎస్.ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేసినారు.

# ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



నాచారం(ప్రశ్న న్యూస్) గణపతి నవరాత్రి ఉత్సవాలను నాచారం దుర్గానగర్ లోని బాల గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ .కార్యక్రమంలో దుర్గా నగర్ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# విద్యార్థులు విద్యలో ఆగ్రగాములుగా వృద్ధి చెందాలి

**- కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ : సన్నిధి వేంకటకృష్ణ**

**- కెటిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నిమజ్జనం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో గణనాధుని నిమజ్జనోత్సవం గురువారం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల ఆటపాటలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సన్నిధి వేంకట కృష్ణ, ప్రిన్సిపల్స్,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సన్నిధి వేంకటకృష్ణ మాట్లాడుతూ, "విద్యార్థులు ఈ వేడుకలో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉంది. అందరి కృషి సఫలమై,విద్యార్థులు విద్యలో అగ్రగాములు కావాలని, గణనాధుని ఆశీర్వాదాలు లభించాలని కోరుతున్నాం"అని అన్నారు.

# డయేరియా బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) రేణిగుంట మండలం గుత్తి వారి పల్లి గ్రామం నందు త్రాగునీరు కలుషితం కావడంతో సుమారు 40 మంది డయేరియాతో బాలాజీ మెడికల్ కాలేజీ నందు చికిత్స పొందుతున్నటువంటి డయేరియా బాధితులను తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి హాస్పిటల్ ను సందర్శించి వారిని పరామర్శించడం జరిగినది. డిసిసి అధ్యక్షులు బాలగురువం బాబు,శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి హాస్పిటల్ వద్ద వైద్యులతో మరియు హాస్పిటల్ సూపరింటెండెంట్ గారితో డయేరియా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అదేవిధంగా బాధితులతో మాట్లాడి వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు ఉంటాయని వారికి భరోసా కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి,శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు నవీన్, రేణిగుంట మండల యువజన అధ్యక్షులు ఆసిఫ్,రేణిగుంట మండల ఓబీసీ అధ్యక్షులు నగేష్,తేజ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్, అర్బన్ నాయబ్ తహసీల్దార్ ను ఘనంగా సన్మానించిన జగిత్యాల జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం

**-ఆర్ డి ఓ ఆఫీస్ డి ఏ ఓ వరంధన్ తహసీల్దార్**

**-అర్బన్ నాయబ్ తహసీల్దార్ గండ్ర రాజేందర్ రావు**



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) ఆర్ డి ఓ ఆఫీస్ డి ఏ ఓ వరంధన్ తహసీల్దార్ ను, అర్బన్ నాయబ్ తహసీల్దార్ గండ్ర రాజేందర్ రావును జగిత్యాల జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమము లో జిల్లా అధ్యక్షులు గాలిపెల్లి ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు, రాజేందర్ రావు, రాజేంద్రప్రాసద్, అసోసియట్ అధ్యక్షులు దుస రాజశేఖర్, ప్రచార కార్యదర్శి పంగ రాజేశం, గిర్దావర్ వినయ్, రాజారాం, అర్బన్, రూరల్ మండలం ఆఫీస్ స్టాఫ్, పెన్షనర్ కట్టగంగాధర్ తదితరులు ఫాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి ఒడిలోకి గణనాథుడు



కైకాల వారి పెండ్లి మండపం వద్ద పంచముఖ విగ్నేశ్వర స్వామి నిమజ్జనోస్తవానికి భారీ ఏర్పాట్లు శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) పట్టణంలోని కైకాల వారి పెండ్లి మండపం వద్ద పంచముఖ వినాయకస్వామి వారిని చెంబెడు మరియు 14 గ్రామాలు వారు నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులు తన్మయత్వంతో, యువత ఉత్సాహంతో, చిన్నారుల కేరింతల మధ్య గురువారం శ్రీ కాళహస్తి పెళ్లి మండపం వద్ద ఉన్న పంచముఖ వినాయకుడిని పెండ్లి మండపం వద్ద నుంచి ట్రాక్టర్లు, ద్వారా వినాయక విగ్రహాలను తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా విద్యుత్ దీపాలు, ఒక భారీ క్రేన్, బోట్లను గజ ఈతగాళ్లను, అధికారులు ఏర్పాటు చేశారు. గంగమ్మకు సర్పంచి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులు గట్టి బందోబస్తు చేపట్టినట్లు తెలిపారు.గణపతి ప్రతిమలను భక్తులు నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసెంట్ ఒబ్బు మధుసూదన్ చెంబెడు మరియు 14 గ్రామాల కైకాల కులస్తులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ అభివృద్ధి ధ్యేయంగా ఎమ్మెల్యే కూనంనేని కృషి

**- అభివృద్ధి పనులకు ఎంపీ రామ సహాయం రఘు రామ రెడ్డితో పాటు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు శంకుస్థాపనలు**

**- విద్యానగర్లో మంచినీటి పైప్లైన్ ఎక్స్టెన్షన్ కోసం శంకుస్థాపన**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) పారిశ్రామి కేంద్రాలుగా ఉన్న కొత్తగూడెం పాల్వంచ పట్టణాలు అభివృద్ధితోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కూనమినేని సాంబశివరావు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ్ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే కూనమినేని సాంబశివరావు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. అయితే చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీలో విస్తరించి ఉన్న పలు ప్రాంతాల ప్రజలకు మంచినీటి సౌకర్యం అందించేందుకు మిషన్ భగీరథ పైప్ లైన్ విస్తరణకు ఎమ్మెల్యే కూనమితో పాటు ఎంపీ శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యానగర్ ప్రాంతంలో గల సారయ్య కాలనీలో మంచినీటి ట్యాంకును నిర్మించేందుకు, పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టినట్లు కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని సిపిఐ 3టౌన్ ఏరియా కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, చుంచుపల్లి కార్యదర్శి వాసిరెడ్డి మురళి, కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, 1టౌన్ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్రావు, సహాయ కార్యదర్శులు బోయిన విజయ్, సత్యనారాయణ చారీ, పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీను ఇతరు నాయకులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో గురువారం వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని పలు మండపాల నుంచి భారీ ఊరేగింపుతో రాగా, విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు భారీగా తరలి వచ్చి గణేశుని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ఘనంగా ఐరన్ బీస్ట్ జిమ్ ప్రారంభం



కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) నూతనంగా ఏర్పాటు చేసిన ఐరన్ బీస్ట్ వ్యాయామశాల (జిమ్)ప్రారంభహోత్సవం ఘనంగా జరిగింది.గురువారం బాచుపల్లి లోని హరితవనం



కాలనీలోసీఐ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావులతో కలిసి ప్రారంభించచారు. ఈ సందర్భంగా ఐరన్ బీస్ట్ జిమ్ నిర్వాహకుడు సంతోష్ కుమార్ ను అభినందించి.భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్లు తెరవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు బిజీ లైఫ్ దిశగా సాగుతున్నారని ముఖ్యంగా యువత వ్యాయామంపై దృష్టి సారించి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శరీర దృఢత్వాన్ని స్థిరపరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, హర్ష, వివేక్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు దేశ భవిష్యత్ నిర్మాతలు

**- సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం**

**- డీటీఎఫ్ యూనియన్ మండల ప్రధానకార్యదర్శి : కుట్ల తిరుపతి**

**- ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన డీటీఎఫ్ నేత - కుట్ల తిరుపతి**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) నేడు శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి,ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి కుట్ల తిరుపతి మండలంలోని ఉపాధ్యాయులకు "ఉపాధ్యాయుల దినోత్సవం" శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. విద్యార్థులకు జ్ఞానం, విలువలు అందించడంలో ఉపాధ్యాయులు చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం. ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తు నిర్మాతలు" అని పేర్కొన్నారు.అదేవిధంగా మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం డీటీఎఫ్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "ఉపాధ్యాయుల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది" అని తిరుపతి పేర్కొన్నారు.

# వేములవాడలో ఘనంగా వినాయక నిమజ్జనాలు - అధికారులు పర్యవేక్షణ




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడలో గురువారం వినాయక నిమజ్జన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ప్రశాంతంగా జరిగాయి. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తులు సౌకర్యంగా పాల్గొన్నారు. నిమజ్జన శోభాయాత్రలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే ప్రత్యక్షంగా హాజరై పర్యవేక్షించారు. అనంతరం గణనాథుడికి పూజలు చేసి, భద్రతా చర్యలపై అధికారులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, మ్యాజిక్ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రత్యేకంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేముల8 ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి,వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, తహసిల్దార్ విజయ్ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్తో పాటు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 49 సంవత్సరాలుగా గణపయ్య నవరాత్రులు



సుల్తాన్ బజార్(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాబాగ్ లోని వీనస్ అసోసియేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కుర్మావతార విగ్నేశ్వరుని పూజలు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నారని శాంత్ కుమార్ తెలిపారు. బుధవారం నాడు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో తన కుటుంబ సభ్యులతో కలిసి విగ్నేశ్వరునికి పూజాధికాలను నిర్వహించారు. ఈ సందర్బంగా శాంత్ కుమార్ మాట్లాడుతు గత 49 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం నిర్విరామంగా గణపతి నవరాత్రులను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక పూజలని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాధాలను అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీనస్ అసోసియేషన్ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.



# భవన నిర్మాణ కార్మికులకు ఈశ్రం కార్డుపై అవగాహన

**- ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి: కడారి రాములు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో లేబర్ అడ్డా వద్ద గురువారం భవన నిర్మాణ కార్మికులకు ఈశ్రం కార్డు ప్రాధాన్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల లేబర్ ఆఫీసర్ మహమ్మద్ నజీర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ మాట్లాడుతూ "ఈశ్రం కార్డు కలిగిన వారికి ప్రమాదంలో మరణించిన పక్షంలో రూ.2 లక్షల ప్రమాద భీమా లభిస్తుంది. కాబట్టి ప్రతి కార్మికుడు ఈ కార్డు పొందాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడెం కనుకయ్య, శేఖర్, మల్లేశం, శ్రీనివాస్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని ధర్నా

**ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మేడ్చల్ బస్ డిపో ముందు ఆందోళన**




మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నేతలు మేడ్చల్ బస్ డిపో ముందు ఆందోళనకు దిగాయి. ఈ నిరసనలో 500 మంది విద్యార్థులు పాల్గొని డిపో నుండి బస్సులు బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తిక్ మాట్లాడుతూ మేడ్చల్ పరిసర ప్రాంతాలతో పాటు అనేక గ్రామాల నుండి విద్యార్థులు కళాశాలలకు రావడానికి బస్సుల ఆలస్యం కారణంగా ఉదయం తరగతులు మిస్ అవుతున్నారని ఆరోపించారు. ఇది వారి చదువుపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని. అలాగే సాయంత్రం బస్సుల ఆలస్యంతో విద్యార్థులు రాత్రివేళ ఇళ్లకు చేరుకుంటున్నారని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను బస్ డిపో మేనేజర్ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల బస్ పాస్ రుసుములు పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారం అవుతున్నాయని అందువల్ల వాటిని తగ్గించాలని కోరారు. విద్యార్థుల ఆందోళనను గమనించిన డిపో మేనేజర్ అక్కడికొచ్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను నోటు చేసుకుని, 10 రోజుల్లోపే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నిరసనలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు భగత్, శ్యామ్, జిల్లా కమిటీ సభ్యులు కరుణాకర్ , ఆకాశ్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి బాల కిరణ్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు సుధీర్, రామ్, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు బేష్

**మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్) వినాయక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన చిన్నారుల ఆధ్యాత్మిక సాంస్కృతి క ప్రదర్శనలు అబ్బురపరిచే విధంగా ఉన్నాయని, ఆధ్యాత్మికత వెల్లి విరిసిందని ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మేడ్చల్ ఏ సి పీ శంకర్ రెడ్డి ప్రశంసించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా రాఘవేంద్ర నగర్ కాలనీలో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద గురువారం 108 ప్రసాదాలను సమర్పించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి ఆధ్యాత్మిక తోడ్పాటు అందిస్తుందన్నారు. చిన్నారులు అన్నమయ్య కీర్తనలు, భక్తిరస ప్రధాన పాటలకు నృత్య ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయం అన్నారు. ప్రజలు ఉత్సవాలను జరుపుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నిమజ్జనంలో నిబంధన పాటించి, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన చిన్నారులను అభినందిస్తూ బహుమతులను ప్రధానం చేశారు.

## జనవరిలోనే ఏపీలో స్థానిక ఎన్నికలు

వైసీపీని పూర్తి స్థాయిలో రోడ్డున పడేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుంటోంది. ఆ పార్టీ క్యాడర్ అనుభవిస్తున్న పదవుల్ని కూడా ఊడగొట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్ని మూడు నెలల ముందుగానే నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎస్ఈసీ నీలం సహాని ఏర్పాట్లు ప్రారంభించారు. ఓటర్లు, పోలింగ్ బూత్‌లు వంటి ప్రక్రియలను డిసెంబర్ లోపు పూర్తి చేయనున్నారు. జనవరిలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారు.మూడు నెలలు ముందే నిర్వహించేందుకు చట్టంలో అవకాశంఅసెంబ్లీ ఎన్నికలను, పార్లమెంట్ ఎన్నికలను ఆరు నెలల ముందుగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి చట్టంలో అవకాశం ఉంది. అదే స్థానిక సంస్థల ఎన్నికలను మాత్రం మూడు నెలల ముందుగా నిర్వహించుకోవచ్చు. చట్టంలో ఉన్న ఈ వెసులుబాట్ల ప్రకారం జనవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ ప్రతిపాదించింది.

దానికి ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.మొదట పంచాయతీ, పరిషత్ ఎన్నికలు తర్వాత మున్సిపల్ ఎన్నికలుఏపీలో ఎన్నికలకు రాజకీయ పరమైన ఆటంకాలు ఏవీ లేవు.గతంలో కరోనా కారణంగా ఆలస్యం అయింది. లేకపోతే ఈ పాటికి స్థానిక సంస్థల ఎన్నికలూ ప్రతి అయి ఉండేవి. గతంలో ఆలస్యంగా నిర్వహించడంతో ఇప్పుడు కూడా ఆలస్యంగా జరుగుతున్నాయి. 2014కి ముందు .. అసెంబ్లీ ఎన్నికలకు ముందే స్థానిక ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు ఏడాదిన్నర తర్వాత జరుగుతున్నాయి. ముందుగా పంచాయతీ, పరిషత్ ఎన్నికలు ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉంది.స్థానిక ఎన్నికల్లో వైసీపీ పోటీ చేయడం కష్టమే !పులివెందులలో ఘోర పరాజయం తర్వాత వైసీపీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తుందా లేదా అన్నదానిపై సందేహాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఎమ్మెల్సీ సహా ఏ ఎన్నికలనూ పోటీ చేయడం లేదు. అన్నింటిలోనూ బహిష్కరించి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ వస్తున్నారు.

# చెక్ మీకు,నీటి చుక్కలు మాకు

# ఏఎంసీలో "2"దశాబ్దాల లొల్లి

- 7 నెలల క్రితం "మంగమ్మ శపథం"మాట నిలబెట్టుకుంది కమిటీ
- ఎప్పుడు వచ్చామని కాదు అన్నయ్యా,అన్న మాట నిలబెట్టుకున్నామాలేదా
- ఇరవై ఏళ్లల్లో పది కోట్లు ఖర్చు,కార్తీకంలో కంటిన్యూ వాటర్
- షాక్లో బోర్డు అధికారులు, శెకండ్లో కమిటీ చైర్మన్ అండ్ టీం
- ఎస్జీఆర్ అండ్ టీం ప్రత్యేక అభినందనలతో పాటు చైర్మన్ న్నీ ఆలింగనం
- ఆనందంతో మాటలు రాక సైగలతో ధన్యవాదాలు తెలిపిన కమీషన్ ఏజెంట్లు
- బోయిన్ పల్లి మార్కెట్ కమిటీకి మొదటి విజయం ఆనందోత్సాహాలతో చైర్మన్




**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కమిటీ ఈ సంవత్సరం జనవరి ఇరవై ఐదున సర్క్యులర్ రావడంతో అదే నెల ఇరవై ఏడున స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ సమక్షంలో కమిటీ బాధ్యతలు చేపట్టిన కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు వైస్ చైర్మన్ దేవేందర్ సభ్యులు.రెండు దశాబ్దాల నుంచి బోయిన్ పల్లి మార్కెట్ లో కమీషన్ ఏజెంట్లు మంచి నీటి ఎద్దడితో నరకయాతన అనుభవించారు.సికింద్రాబాద్వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ నేతృత్వంలో పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబుని కలిసి మార్కెట్లో నీటి సరఫరా లేదని రెండున్నర దశాబ్దాలుగా కోట్ల రూపాయలు వెచ్చించి మినరల్ వాటర్ బాటిల్స్ కోనుగోలు చేస్తున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.అలాగే మార్కెట్ లో మౌళిక సదుపాయాల విషయంలో కూడా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కమీషన్ ఏజెంట్లు,ఖరీదు దారులు హమాలీలు అంటూ సోమ దేవేందర్ రెడ్డి చైర్మన్ కి వివరించారు.వేంటనే కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన కమీషన్ దార్లతో సమావేశం ఏర్పాటు చేశారు.ఆ మీటింగ్ లో అందురు మౌళిక సమస్యలు పై గళం విప్పారు.అందులో ముఖ్యంగా తాగడానికి కౌప్కడు నీళ్ళు కూడా లేవని దయచేసి మంచి నీళ్ళు మార్కెట్ కి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు.వేంటనే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దేవేందర్ తొడగొట్టి చెబుతున్న ఆరు మాసాల్లో

మంచి నీళ్ళు మీకు వస్తాయి లేక పోతే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు.అనుకున్నట్లు నెల అటు ఇటు అయిన అన్నమాట



నిలబెట్టుకున్నారు కమిటీ పెద్దలు.ఎదేమైనా రెండున్నర దశాబ్దాలుగా కమీషన్ ఏజెంట్లు పడుతున్న సమస్యను పరిష్కరించినకమిటీ.కానీ అసలు విషయం ఏమిటంటే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంజూరు చేసిన "55"లక్షల రూపాయలు చెక్ రావడానికి కారణం ముగ్గురు మేధావుల కష్టఫలితం.చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవేందర్, మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్న.త్రిముఖుల కలయిక కన్నీళ్లు పెట్టుకుంటున్న కమీషన్ దార్లకంత గోశకు చెక్ తో చెక్ పెట్టారు.నిన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇవో మధుకర్ నాయక్ తో భేటీ అయిన బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ పెద్దలు.బోర్డుఅధికారులు వేసిన ఎస్టిమేట్ "55"లక్షల రూపాయలు, మార్కెటింగ్ శాఖ ద్వారా మంజూరు అయిన విషయం వారికి తెలియజేశారు. సిఇవోమధుకర్ నాయక్ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.సార్ఇదంతా మా పెద్ద చలువే అంటూ వైస్ చైర్మన్ దేవేందర్ కి కితాబు ఇచ్చారు ఆనంద్ బాబు.వయస్సులో పెద్ద వాడుఅయిన యువకుడు లాగా మా అందర్నీ ముందుకు నడుపిస్తున్న దేవన్న అంటూ నువ్వులు పువ్వులు పండించారు.ఇది వాస్తవం అంటూ సిఇవో కూడా చైర్మన్ కివత్తాసు పలకడం విశేషం.అన్నీబాగున్నాయి కానీ బోయిన్ పల్లి మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు ఏ విధమైన వినియోదారులుగా (కన్జూమర్)పరిగణనలోకి తీసుకుంటారనేదే ప్రశ్న ఉత్పన్నం అవుతుంది.మొదటిది బల్క్ కన్జూమర్, రెండువది రెసిడెన్షియల్ వినియోగదారులుగా పరిగణిస్తారా ఎదురు చూడాల్సిందే!

**రెండు నెలల్లో పనులు పూర్తి..**

బోర్డు వాటర్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ రెండు మాసాల్లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లోకి గళ గళ గంగమ్మ మీ షాపు ముందు పరుగులు తీస్తుంది అని అన్నారు.త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ముగిస్తామన్నారు.అలాగే ఈ వినాయక నవరాత్రులు పూర్తి అయిన తరువాత మార్కెట్ కి వచ్చి మరోసారి సందర్శిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, మార్కెట్ సెక్రటరీ ఎం వేంకన్న, వైస్ చైర్మన్ దేవేందర్, సభ్యులు డిసి ప్రభాకర్,దుర్గేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొట్టు ప్రభాకర్,బోర్డు వాటర్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ రాజ్ కుమార్, సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి, కార్యదర్శి ఆర్వీసీ చాంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై

# ఉక్కు పాదం మోపుతాం

- ఏసిపి కృష్ణమోహన్
- అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టొద్దు
- నోటీసుల ప్రక్రియ పూర్తికాగానే సీజింగ్ లేదా కూల్చివేతలు







**కాప్రా (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని ఉక్కు పాదం మోపుతామని కాప్రా టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమోహన్ తెలిపారు. కాప్రా మున్సిపల్ కార్పొరేషన్ లో భారీగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజా ప్రశ్న దినపత్రికల్లో వచ్చిన కథనాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని ఎంతటి వారైనా సరే అక్రమ నిర్మాణాలు చేపడితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చర్లపల్లి డివిజన్లో రైల్వే స్టేషన్ ముందు రెండు అక్రమ నిర్మాణాలు అదేవిధంగా కాప్రా పాత మున్సిపల్ వెళ్లే దారిలో ఒక భవనమును సీజ్ చేశారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం సంతోషమని, కాప్రా మున్సిపల్ సర్కిల్లో ప్రభుత్వం విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని అధికారులకు పదేపదే తెలిపిన కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం మానేశారని ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టడం సంతోషమని, కాప్రా మున్సిపల్ సర్కిల్ ప్రభుత్వం విరుద్ధంగా చాలా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిపై కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని స్టిల్ట్ లో వ్యాపారాలు చేస్తూ వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారని వెంటనే స్టిల్ట్ లో నిర్మాణాలను తొలగించి పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పెండ్లి మండపం పంచముఖ వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లి మండపం వద్ద చెంబెడు మరియు 14 గ్రామాల కైకాల కులస్తులు ఏర్పాటుచేసిన పంచముఖ విఘ్నేశ్వరుని దర్శించుకున్న స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి. అనంతరం కైకాల కుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా బొజ్జల సుధీర్ రెడ్డి కైకాల వారి సత్రంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశానికి గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకాల కులస్తులకు మా కుటుంబంతో విడదీయరాని అనుబంధం కలిగి ఉన్నారన్నారు. కైకాల కుల సంఘం సభ్యుల వినతి మేరకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం బోర్డు మెంబర్, కార్పొరేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు మీ ప్రతిపాదన తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. చెంబెడు మరియు 14 గ్రామాల ప్రజలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కైకాల కుల సంఘం అధ్యక్షుడు ఒబ్బు మధు, కమిటీ సభ్యులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, టిడిపి నాయకులు వెంకట ముని తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యలో కొత్త మైలురాయి సృష్టించిన డాక్టర్ రాజగోపాల్

- 42 ఏళ్ల సేవలకు గుర్తింపు
- డాక్టర్ రాజగోపాల్ కు రాష్ట్ర అవార్డు
- డాక్టర్ రాజగోపాల్ కృషి మరువలేనిది
- అగ్రహారం ప్రిన్సిపాల్ : ప్రభాకర చారి
- ఈ గౌరవాన్ని విద్యార్థులకు నా సహోద్యోగులకు అంకితం చేస్తున్నా
- విశ్రాంత పూర్వ ప్రిన్సిపాల్ : డాక్టర్ బి. రాజగోపాల్





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండలం,అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ బి. రాజగోపాల్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "రాష్ట్ర ఉత్తమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్" అవార్డును గురువారం ఆయనకు ప్రకటించింది.

సాంకేతిక విద్యాభివృద్ధికి 42 ఏళ్ళ,5 నెలలపాటు అంకితభావంతో సేవలందించిన రాజగోపాల్ గత సంవత్సరం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రిన్సిపాల్ పి. ప్రభాకర చారి మాట్లాడుతూ – "డాక్టర్ రాజగోపాల్ గారి కృషి మరువలేనిది" అని అన్నారు.

**కెరీర్‌లో ముఖ్యాంశాలు**

– కెరీర్ గైడెన్స్ ద్వారా వేలాది విద్యార్థులకు మార్గనిర్దేశం
– AICTE-QIP కింద NITK సూరత్కల్‌లో పీహెచ్‌డీ పూర్తి
– సివిల్ విభాగాధిపతిగా డిప్లొమా పట్టాల సంఖ్య 2 నుండి 90కి పెంపు
–ఆధునిక ల్యాబ్‌ల అభివృద్ధి, బాలికల & SC-ST హాస్టళ్ల ఏర్పాటు
–రాష్ట్ర స్థాయి క్రీడలు, టెక్ ఫెస్టుల నిర్వహణ
–అలుమ్ని మీట్, "అలుమ్ని టాక్స్" ప్రారంభం
– సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ గుర్తింపు (2023)

చిన్న పట్టణాల్లో పనిచేస్తూనే గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించడంలో ఆయన కృషి విశేషం. ఆయన శిష్యుల్లో పలువురు చీఫ్ ఇంజనీర్,సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఎదగడం గర్వకారణం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తనకు అవార్డును ప్రకటించిన నేపథ్యంలో డాక్టర్ రాజగోపాల్ స్పందిస్తూ – "ఈ అవార్డు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్‌లా భావిస్తున్నాను. నా నామినేషన్ కోసం సాంకేతిక విద్యా కమీషనర్ శ్రీదేవసేనా, సెలెక్షన్ కమిటీ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ గౌరవాన్ని నా సహోద్యోగులు, ఉన్నతాధికారులు,నా కుటుంబం,నా ప్రియమైన విద్యార్థులందరికీ అంకితం చేస్తున్నాను" అని అన్నారు.

# కవిత ఆరోపణలు హాస్యాస్పదం

# - జోగినిపల్లి సంతోష్ కేసీఆర్ కుడి భుజం

- పార్టీ ఐక్యతకే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి
- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ జిల్లా నేత : అనుముల భాస్కర్ స్పందన





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అనుముల భాస్కర్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. కేసీఆర్ అత్యంత నమ్మిన వ్యక్తి, పార్టీకి కుడి భుజంగా నిలిచిన జోగినిపల్లి సంతోష్ కుమార్‌పై ఆరోపణలు చేయడం విచారకరం అని ఆయన వ్యాఖ్యానించారు. "సంతోష్ తెలంగాణ ఉద్యమం నాటి నుండి కేసీఆర్ పక్కన ఉండి కష్టపడ్డ నాయకుడు. ప్రభుత్వంలోనూ, ప్రతిపక్షంలోనూ పార్టీ కోసం రాత్రింబవళ్లు శ్రమించాడు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వంటి పర్యావరణ కార్యక్రమాలతో రాష్ట్రానికి విశేష సేవలు చేశాడు. అలాంటి వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం ఎవరికీ మంచిది కాదు" అని భాస్కర్ తెలిపారు.అలాగే ఆయన కవితను ఉద్దేశిస్తూ – "పార్టీ క్రమశిక్షణను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, పార్టీ బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలి" అని సూచించారు.భవిష్యత్తులో పార్టీ ఐక్యతకే ప్రాధాన్యత ఇవ్వాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని భాస్కర్ హితవు పలికారు.

# విలాసాగర్‌లో గౌడ కుల సంఘ భవన నిర్మాణానికి శ్రీకారం

- కేంద్రమంత్రి బండి సహకారం
- భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు : ఉదారి నరసింహా చారి



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) కరీంనగర్ ఎంపీ,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసిన గౌడ కుల సంఘ భవన నిర్మాణానికి గురువారం విలాసాగర్ గ్రామంలో భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నరసింహ చారి మాట్లాడుతూ, "గౌడ కుల అభివృద్ధి కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించడంలో భవనాల నిర్మాణం ఎంతో కీలకం. ఈ క్రమంలో ఎంపీ బండి సంజయ్ ఇచ్చిన సహాయం ప్రశంసనీయమైనది" అని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు, కుల సంఘ నాయకులు, బీజేపీ నాయకులు పసికంటి వెంకటేష్, సుంకపాక ప్రభు, సుంకపాక చక్రవర్తి, రేగుల రమేష్, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నేతలు బొంగాని అశోక్ గౌడ్, సారంపల్లి రాజు, పాలోజి రాజేంద్రప్రసాద్, కొండం శ్రీనివాస్ రెడ్డి, రేగుల సంపత్, ఆకుల కోటి, గాలిపల్లి అఖిల్, ఆకుల హరీష్, బూర నరహరి, కొక్కుల అశోక్, మెరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి మనోహర్ రెడ్డి పరామర్శ



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కూరగాయల శ్రీశైలం తండ్రి "కూరగాయల పోశెట్టి" ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను గురువారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట మహేష్,ఉమర్,అజీజ్ తదితరులు ఉన్నారు.

# గామ ఫౌండేషన్ మానవతా స్ఫూర్తి

- 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ
- గామ ఫౌండేషన్ నియోజకవర్గం ప్రాజెక్ట్ డైరెక్టర్ : జోగు పాల్



**గంగాధర (ప్రశ్న న్యూస్)** గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్శకుర్తి గ్రామంలో గురువారం ట్రస్ట్ సేవల్లో భాగస్వామ్యులైన 70 మంది లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ జరిగింది. ట్రస్ట్ సీఈఓ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు, చొప్పదండి నియోజకవర్గం ప్రాజెక్ట్ డైరెక్టర్ జోగు పాల్ పర్యవేక్షణలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలను 10 యూనిట్లుగా సంఘాలుగా ఏర్పరచి, ప్రతి నెలా నిత్యావసరాలు అందజేయడం ట్రస్ట్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ క్రమంలో 70 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జోగు పాల్ మాట్లాడుతూ ౹ "సభ్యులు వాలంటరీగా ఇచ్చే విరాళాల ద్వారా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. పదిమంది సభ్యులను ఒక సంఘంగా ఏర్పరచి ప్రతి నెలా వారికి అవసరమైన సరుకులు అందించడం మా లక్ష్యం" అని తెలిపారు.అనంతరం గ్రామస్తులు ట్రస్ట్ చేసిన సహాయానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గామ ఫౌండేషన్ సభ్యులు, లబ్ధిదారులు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల అభివృద్ధికి కోటి 96 లక్షల నిధులు మంజూరు

- విద్యా సంస్థల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది - విప్ ఆది
- హర్షం వ్యక్తం చేసి విప్ ఆదికి కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు - అధ్యాపకులు



**వేములవాడ.(ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల మరమ్మతుల కోసం సర్వ శిక్ష అభియాన్ నిధుల కింద రూ. రూ.1.96 కోట్లు మంజూరయ్యాయి. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు రూ. 1.35 కోట్లు కేటాయించగా, చందుర్తి కేజీబీవీకి రూ. 58 లక్షలు, కోనరావుపేటకు రూ. 56 లక్షలు, రుద్రంగి, వేములవాడ రూరల్, అర్బన్‌కు వరుసగా రూ. 8 లక్షలు, రూ. 8 లక్షలు, రూ. 5 లక్షలు కేటాయించారు. జూనియర్ కళాశాలలకు మొత్తం రూ. 96.62 లక్షలు కేటాయించగా, రుద్రంగి జూనియర్ కళాశాలకు రూ. 36.90 లక్షలు, వేములవాడకు రూ. 24.15 లక్షలు, కోనరావుపేటకు రూ. 19 లక్షలు, చందుర్తికి రూ. 18.47 లక్షలు కేటాయించారు. ఈ నిధులను భవనాల మరమ్మతులు,విద్యుత్, త్రాగునీటి సదుపాయాల అభివృద్ధి,పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యాసంస్థల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ ఆది అన్నారు.

# ధర్పల్లి ఎస్ఐ కళ్యాణి చేతుల మీదుగా గణపతి చందా డబ్బులతో హెల్మెట్లు పంపిణీ



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం డి బి తాండా లో గాంధీ అసోసియేషన్ వారు గణేష్ నిమజ్జనం సందర్భంగా వారు సేకరించిన గణేష్ చందా లో మిగిలిన డబ్బులతో 10 హెల్మెట్లు, ఒక సైకిల్ కొని, లక్కీ డ్రా ద్వారా వాటిని తాండా ప్రజలకు ధర్పల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కళ్యాణి చేత పంపిణీ చేయించారు. ఇట్టి సందర్భంగా ఎస్ ఐ కళ్యాణి గాంధీ అసోసియేషన్ వారిని అభినందిస్తూ తాండా ప్రజలకు హెల్మెట్ వాడకం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, అలాగే గాంధీ అసోసియేషన్ తీస్కున్నటువంటి ఈ ఆలోచనను దృష్టి లో ఉంచుకుని అందరూ తప్పకుండా హెల్మెట్ ధరించాలని, తాండా ప్రజలకు సూచించారు

# మానవత్వం చాటుకున్న విలేఖరి సదానందచారి పరామర్శ



నాగారం(ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్ కు చెందిన పేయింటర్ లక్ష్మణ్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలియగా చిన్న సహాయం చేసిన విలేకరి సదానంద చారి. ఈ సందర్భంగా విలేకరి సదానంద చారి మాట్లాడుతూ అనుకోని సంఘటనలో చెట్టు మీది కంచిపడి వెన్నుపూస కాళ్లు పనిచేయకపోవడంతో సమాచారం తెలియడంతో మల్కాజ్గిరి విలేఖరి సదా నంద్ చారి లక్ష్మణ్ ఇంటికి వెళ్లి పండ్లు, బ్రెడ్ అందజేశారు. మీరు ధైర్యంగా ఉండాలని, మా మిత్రులతో కలిసి తోచినంత ఆర్థిక సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. మీ అనారోగ్య సమస్యను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తానని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మనుషులు మానవత్వం చాటుకోవాలని తోటి వ్యక్తులను ప్రేమించి సాధకా బాధలు తెలుసుకొని ఆదుకున్నప్పుడే మానవత్వం అనేది బయటపడుతుందని ఇలాంటి వ్యక్తులకు ఎవ్వరికీ తోచిన సహాయం వారు చేయవచ్చని, అంతేగాకుండా సీఎం ఆర్ ఎఫ్ ద్వారా మీకు మెరుగైన వైద్య చికిత్స అందించడానికి తగిన చర్యలు తీసుకుంటా నని సదానందచారి బాధితునికి ధైర్యం చెప్పారు.

# అనుపురం లో ముందస్తుగా ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలం,అనుపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. విట్టల్ మాట్లాడుతూ, "రాధాకృష్ణన్ ఆదర్శవంతులు, వారి సేవలు అమూల్యమైనవి. విద్యార్థులు క్రమశిక్షణతో, మంచి నడవడితో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు" అని పేర్కొన్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మ్యాజిక్ ప్రదర్శనతో ఎం. లక్ష్మీనారాయణ విద్యార్థులను అలరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. రమేష్, ఎస్. దేవేందర్, మానవాడ శంకర్, కామిని రవీందర్, ఎన్. రమేష్, కే. రజితతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి సమాజంలో టెక్నాలజీ యుగంలో విద్యా విలువలు తగ్గొద్దు

- ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పది
- బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు : సత్యనారాయణ



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉపాధ్యాయులకు "ఉపాధ్యాయ దినోత్సవం" శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి ఉపాధ్యాయుడికి గౌరవం. ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పది. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైంది. విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే కర్తవ్యాన్ని నిర్వర్తించడం మహత్తరమైన పని. క్రమశిక్షణ,నిజాయితీతో బోధన చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలి. నేటి సమాజం టెక్నాలజీ యుగంలోనూ విద్యా విలువలు తగ్గకూడదు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకుడు, ప్రేరణాదాయకుడిగా నిలవాలి" అని ఆయన పేర్కొన్నారు.

# ఆర్ఎంపీల ఇష్టారాజ్యానికి చర్యలేవి.?

- ఎంబిబిఎస్, ఎండి లను మించిన ఆర్ఎంపీల వైద్యం
- వైద్య బృందం తనిఖీలలో బయటపడ్డ విస్తుపోయే నిజాలు
- హెవీ డోస్ మందులు చూసి విస్తుపోయిన వైద్యులు
- ఆర్ఎంపీలపై నేటికీ చర్యలు చేపట్టని జిల్లా వైద్య అధికారులు





**జూలూరుపాడు (ప్రశ్న న్యూస్)** వైద్యులను దేవునితో పోలుస్తారు. అలాంటి వైద్య వృత్తికి కొందరు మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఆర్ఎంపీ) లు మచ్చతెస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్ఎంపీలు ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని వైద్యం పేరుతో అడ్డంగా దోచుకుంటున్నారు. మండలంలోని నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఆర్ఎంపీలు వైద్యం చేస్తుండగా మరికొందరు సరైన అనుమతులు లేకుండా క్లీనిక్‌లు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఏకంగా పడకలను ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. కానీ ఎండీ, ఎంబీబీఎస్, వైద్యుల తరహాలో వైద్యం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆర్ఎంపీలతో సమావేశం నిర్వహించి హెచ్చరించినప్పటికీ వారి తీరు మారడం లేదు.

### నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీల వైద్య సేవలు..

మండలంలో దాదాపు 30మంది ఆర్ఎంపీలు ఉన్నారు. వీరు



ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. ప్రథమ చికిత్స కేంద్రానికి ఎలాంటి పేరు పెట్టకూడదు. అతని పేరు కూడా డాక్టర్‌గా రాసుకోకూడదు. కట్లు కట్టడం, సెలెన్ ఎక్కించడం, ఇంజక్షన్‌లు వేయడం చేయకూడదు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్య చికిత్సలు చేయకూడదు. రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్‌లు, చికిత్స కోసం పడకలు ఏర్పాటు చేయకూడదు. అలాగే షుగరు, రక్తపరీక్షలతోపాటు స్కానింగ్ తీసుకోవాలని ఎలాంటి సిఫారసులు చేయకూడదు. కానీ వీటన్నింటికి విరుద్ధంగా ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు ఆర్ఎంపీలు వైద్యం పేరుతో దోచుకుంటున్నారు.

### నిరుపేదలను అడ్డంగా దోచుకుంటున్న ఆర్ఎంపీలు..

ఆర్ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, తండాల్లో ప్రజలకు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల బారిన పడుతున్న సమయంలో ఆర్ఎంపీలు వైద్యం చేస్తున్నారు. ఇటీవల కొందరు పట్టణ ప్రాంతాల్లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో కొంత కాలంగా పనిచేసిన వ్యక్తులు తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలుగా అవతారం ఎత్తుతున్నారు. అరకొర వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అలాగే రక్తమూత్ర పరీక్షలు చేయించుకోవాలని ల్యాబ్ టెక్నిషియన్‌లతో పర్సంటేజీలు మాట్లాడుకుని రోగులను దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో కుమ్మక్కై రోగులను రెఫర్ చేస్తూ బిల్లులో 20 శాతం నుంచి30 శాతం వరకు కమీషన్లు తీసుకుంటున్నారు. ఆర్ఎంపీల తతంగం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి రావడంతో సోమవారం వైద్య బృందం మూడు విభాగాలుగా ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడుల చేసి కొందరు ఆర్ఎంపీలు వారి స్థాయికి మించి వైద్య సేవలు చేస్తూ అధిక మొత్తంలో డోసులు వేస్తున్న మందులను గుర్తించారు. ఆర్ఎంపీలు వాడే మందులు ప్రజల ప్రాణాలకు ప్రమాదకరమని గుర్తించి పరిమితికి మించి వైద్యం అందిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హతకు మించి వైద్యం అందించవద్దని హెచ్చరించినప్పటికీ కొందరు ఆర్ఎంపీల తీరులో మార్పు రాలేదని తెలిపారు.

### నేటికీ చర్యలు చేపట్టని జిల్లా వైద్య శాఖ..

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పలు ఆర్ఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు నిర్వహించామని మండల కేంద్రంలోని కొందరు ఆర్ఎంపీలు అధిక మొత్తంలో డోసులు వాడుతున్నట్టు గుర్తించి నివేదిక తయారుచేసి జిల్లా అధికారులకు పంపిస్తామని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని, ఆర్ఎంపీలు కేవలం ఫస్ట్‌ఎయిడ్ మాత్రమే చేయాలి. ఆర్ఎంపీలతో సమావేశం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించవద్దని హెచ్చరించామని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్ఎంపీలు నిబంధనల ప్రకారం ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపిన వైద్య అధికారులు జిల్లా వైద్య శాఖకు సంబంధించిన అధికారులు నివేదిక ప్రకారం చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటో అంత చిక్కడం లేదు. స్థానిక ఆర్ఎంపీ వైద్యులు, జిల్లా వైద్య అధికారుల కనుసన్నులలో వైద్యం నిర్వహిస్తున్నారా?? లేకపోతే చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యం డబ్బు బలమా? లేక రాజకీయ బలమా? అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొంది.

## సోనియాగాంధీకి కొత్త చిక్కులు..

### పౌరసత్వం రాకముందే ఓటరుగా నమోదు!

- సోనియా గాంధీ ఓటరు నమోదుపై ఢిల్లీ కోర్టులో క్రిమినల్ ఫిర్యాదు
- పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో పేరు చేర్చారని ఆరోపణ
- 1983లో పౌరసత్వం, 1980లోనే ఓటరుగా నమోదు అయ్యారని పిటిషన్
- నకిలీ పత్రాలతో ఫోర్జరీ జరిగిందని ఫిర్యాదుదారు వాదన
- సెప్టెంబర్ 10వ తేదీకి తదుపరి విచారణ వాయిదా
- ఇదే అసలైన ఎన్నికల మోసమంటూ బీజేపీ విమర్శలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్):** ఓటరు నమోదు వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తాజాగా న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. ఆమెకు భారత పౌరసత్వం అధికారికంగా లభించడానికి మూడేళ్ల ముందే, అంటే 1980లోనే ఆమె పేరు ఓటరు జాబితాలో చేరిందంటూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఒక క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. ఇందుకోసం నకిలీ పత్రాలను ఉపయోగించి ఉంటారని, ఇది శిక్షార్హమైన నేరమని పిటిషనర్ ఆరోపించారు. వికాస్ త్రిపాఠి అనే వ్యక్తి దాఖలు చేసిన ఈ ఫిర్యాదుపై అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా నిన్న ప్రాథమిక వాదనలు విన్నారు. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ 10వ తేదీకి వాయిదా వేశారు.

ఈ వ్యవహారంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ఫిర్యాదుదారు కోర్టును అభ్యర్థించారు. ఈ అంశంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా స్పందించింది. అసలైన ఎన్నికల మోసం ఇదేనంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించింది. రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు మదన్ రాథోడ్ మాట్లాడుతూ "ఆమె 1980లోనే ఓటరుగా నమోదయ్యారు, కానీ పౌరసత్వం పొందింది 1983లో. ఇంతకంటే పెద్ద దొంగతనం ఏముంటుంది?" అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ సాకులు వెతుకుతుందని ఆయన విమర్శించారు. "మేము ఓట్ల దొంగతనానికి పాల్పడితే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అశోక్ గెహ్లాట్ వంటి కాంగ్రెస్ నేతలు ఎలా గెలిచారు? గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని, ఓడినప్పుడు మాత్రం ఇతరులపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటు" అని ఆయన అన్నారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీయే ఓటరు జాబితాలను తారుమారు చేస్తూ నకిలీ పేర్లను చేర్చిందని కూడా ఆయన ఆరోపించారు.

# గ్రానైట్ కటింగ్ షాపు లక్షల రూపాయలు వసూలు చేసి ఏం చేశారు: బండి సంజయ్

### ఒక్కొక్క షాపు నుండి 10 నుండి 50 లక్షల వరకు దోచుకున్నారు కదా

- ఇంకెన్నాళ్లు బీఆర్ఎస్ కు దోచిపెడతారు.?
- మీరు వ్యాపారాలకు రాజకీయాలకు వాడుకుంటారు
- రాజకీయ నాయకులయ్యాక మాలాంటి వాళ్లను ఓడించాలని చూస్తారు
- ఆ సొమ్మును వసూలు చేసి ఏం చేశారు.?
- వసూలు చేసిన పైసల లెక్కలన్నీ తీస్తా
- సమాజానికి పనికొచ్చే సేవ చేయరా.?
- నాపై నిందలేసినా ఖండించరా.?
- చైనాతో సంబంధాలు మెరుగుపర్చినా మోదీకి థ్యాంక్స్ చెప్పరా.?
- భయపడుతూ ఎన్నాళ్లు వ్యాపారం చేస్తారు
- స్వేచ్ఛగా వ్యాపారం చేసే పరిస్థితిని నేను కల్పిస్తా
- సంపాదించడంతోపాటు సమాజానికి సేవ చేయండి
- గ్రానైట్ వ్యాపారుల ఎదుట కేంద్ర మంత్రి బండి సంజయ్ నర్మగర్భ వ్యాఖ్యలు
- ఖంగుతిన్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు
- మోదీ చైనా పర్యటనతో మా వ్యాపార సంబంధాలు మెరుగవుతాయన్న గ్రానైట్ వ్యాపారులు
- సమాజానికి సేవ చేస్తామని చెప్పిన సంఘం నేతలు
- అధికారులకు సహకరించాలని కోరిన బండి సంజయ్



**హైదరాబాదు(ప్రశ్న న్యూస్)** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ లోని గ్రానైట్ అసోషియేషన్ నాయకులకు ఝలక్ ఇచ్చారు. 20 ఏళ్లుగా గ్రానైట్ వ్యాపారులంతా బీఆర్ఎస్ కు దోచిపెడుతూనే ఉన్నారని, ఇంకెన్నాళ్లు దోచిపెడతారని ప్రశ్నించారు. ఒక్కో గ్రానైట్ కటింగ్ మిషన్ దుకాణం నుండి సభ్యత్వం పేరుతో గ్రానైట్ అసోసియేషన్ రూ.10 లక్షల నుండి రూ.50 లక్షల దాకా వసూలు చేసిందని, ఆ సొమ్మును ఏం చేశారని చెప్పాలన్నారు. గ్రానైట్ వ్యాపారుల నుండి వెయ్యి కోట్లు తీసుకున్నట్లు నాపై కొందరు దుష్ప్రచారం చేస్తూ నిందలేసినా ఖండించలేదని అన్నారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ తొలుత మానకొండూరు చెరువు వద్దకు వచ్చారు. అక్కడ గ్రానైట్ అసోసియేషన్ నాయకులు తిరుపతి గౌడ్ తోపాటు మరికొందరు నాయకులు ఎదురుపడ్డారు. ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లాచ్చాక వ్యాపార సంబంధాలు మెరుగుపడ్డాయని, గ్రానైట్ వ్యాపారం పుంజుకునే అవకాశం ఉందని గ్రానైట్ అసోసియేషన్ నేతలు చెప్పారు. ఆ వెంటనే సంజయ్ స్పందిస్తూ "మరి కనీసం ప్రెస్ మీట్ పెట్టి మోదీకి థ్యాంక్స్ అయినా చెప్పారా.? ఎందుకు చెప్పలేదు.? గత 20 ఏళ్లుగా మీరంతా బీఆర్ఎస్ కు దోచిపెడుతూనే ఉన్నారు. మీలో కొందరు వ్యాపారాల కోసం రాజకీయాలను వాడుకుంటున్నరు. కొందరు రాజకీయ నాయకులై వ్యాపారాలను పెంచుకుంటున్నారు. వచ్చిన సొమ్ముతో రాజకీయాలు చేస్తారు. మాలోంటోళ్లను ఓడగొట్టాలని చూస్తరు."అని చురకలంటించారు. గ్రానైట్ అసోసియేషన్ నుండి బండి సంజయ్ కోట్ల రూపాయల లంచం తీసుకున్నాడంటూ గతంలో జరిగిన దుష్ప్రచారాన్ని ఈ సందర్భంగా సంజయ్ వారి వద్ద ప్రస్తావించారు. "ఏనాడైనా మీరు నాకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా.? నేను గెలిచిన తరువాత కూడా మీలో ఒక్కరైనా నా దగ్గరకు వచ్చి కనీసం బొకే అయినా ఇచ్చారా.? ఒక్క స్వీటు ముక్క కూడా తిన్పించలేదు కదా. కానీ బయట మాత్రం కొందరు నాకు 700 కోట్ల రూపాయలు ఇచ్చానని నిందలేస్తుంటే మీ అసోసియేషన్ కనీసం ఖండించలేదు. పైగా వందల కోట్ల రూపాయలను బీఆర్ఎస్ కు దోచి పెట్టి ఆ పార్టీని ఇంకా సాదుతున్నారు. కానీ సమాజానికి సేవ చేయాలనే ఆలోచన మాత్రం మీకు రావడం లేదు."అని వ్యాఖ్యానించారు. ఆ తరువాత అక్కడి నుండి చింతకుంట చెరువు వద్దకు వచ్చి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతుండగా మల్లిఖార్జున మధు తో కలిసి కొందరు గ్రానైట్ వ్యాపారులు అక్కడికి వచ్చారు. మళ్లీ వాళ్లను ఉద్దేశించి "గ్రానైట్ అసోసియేషన్ కేంద్రానికి చెల్లించింది రూ. 300 కోట్లకు మించి లేదు. బయటకు పోయి మాత్రం వెయ్యి కోట్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. గ్రానైట్ కటింగ్ మిషన్ దుకాణాల నుండి సభ్యత్వం పేరుతో ఒక్కో దుకాణం నుండి రూ.10 లక్షల నుండి రూ.50 లక్షల దాకా గ్రానైట్ అసోసియేషన్ వసూలు చేసింది. దాదాపు 350 నుండి 500 షాపుల దాకా డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందని మరి ఆ సొమ్మును ఏం చేశారు.? సమాజానికి ఏమైనా సేవ చేశారా.? గణేశ్ పండుగ సందర్భంగా గల్లీగల్లీలో గణేష్ మండపాలు పెడతారు. కనీసం తట్టెడు మట్టి పోశారా.? కరెంట్ బిల్లులైనా కట్టారా.? అధికారులు, పోలీసులు సొంతంగా ఖర్చు పెట్టుకుని తిండి తింటూ రాత్రింబవళ్లు డ్యూటీ చేస్తారు. అట్లాంటి వాళ్లకు భోజన, మంచి నీళ్ల సదుపాయాలైనా కల్పించారా? అవేమీ చేయరు. మరి వసూలు చేసిన కోట్ల రూపాయలను ఏం చేశారు.? తీస్తా... ఆ లెక్కలన్నీ త్వరలోనే బయటకు తీస్తా..."అని అన్నారు. దీంతో ఖంగుతిన్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు సమాజానికి సేవ చేస్తామని అందులో భాగంగానే గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలోనే మోదీకి సైతం థ్యాంక్స్ చెబుతామని, గ్రానైట్ అసోసియేషన్ పేరుతో సమాజానికి సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ ఎవ్వరికీ పైసలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితిని కల్పిస్తానని, సమాజానికి సేవ చేసే కార్యక్రమాలు చేయాలని సూచిస్తూ ముందుకు సాగారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588